ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు జిల్లా వార్తలు
5
గురువారం 9 అక్టోబరు 2025






## అడవిలో దొంగలు..

- అక్రమంగా జామాయిల్ నరికివేత

లోపలి పేజీలో..



అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొమరిపాలెంలో జరిగిన బాణసంచా ప్రమాద దృశ్యాలు



# బాణసంచా.. చీకట్లు!

## కొద్దిపాటి నిర్లక్ష్యం..పొంచి ఉన్న పెను ప్రమాదం

- ఏటా జిల్లాలో వరుస ఘటనలు
- పాఠాలు నేర్వని వ్యాపారులు
- చోద్యం చూస్తున్న అధికారులు
- దీపావళి పండుగ నాడు జర జాగ్రత్త!

దీపావళి మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాల్లోను, వ్యాపార దుకాణాల్లో ఏటా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎక్కువగా తయారీ కేంద్రాల్లో కూలీలే ప్రమాదాలకు బలవుతున్నారు. తాజాగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొమరిపాలెం బాణ సంచా మందుగుండు దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించగా ఏడుగురు సజీవ దహనం అయ్యారు. ఈ ఘటనతో ఉభయగోదావరి జిల్లాల ప్రజలు ఉలిక్కి పడ్డారు. నిర్వాహకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణాలు బలి అవుతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఏలూరు క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పిల్లల నుంచి పెద్దల వరకు దీపావళి నాడు ఒక్క టపాసు అయినా కాల్చి పండుగలో భాగస్వాములు అవుతారు. ఆనందంగా గడపాల్సిన రోజున కొద్దిపాటి నిర్లక్ష్యం వల్ల జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతుండగా మరి కొంతమంది శరీర భాగాలను కోల్పోయి దివ్యాంగులుగానే మిగిలిపోతున్నారు. ఇలాంటి దురదృష్ట ఘటనలు ఏ ఒక్కరికి జరగకూడదని పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నా ఏటా ఏదో ప్రమాదం జరుగుతూనే ఉంది.

### జిల్లాలో గతంలో జరిగిన ప్రమాదాలు

ఏలూరు శనివారపుపేట దొండపాడులో పెంకుటింటిలో టపాసులను అనధికారంగా తయారు చేస్తుండగా ప్రమాదం సంభవించి ముగ్గురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. ఏలూరు కొత్తపేటలో ఒక ఇంట్లో టపాసులు నిల్వ ఉంచుకోగా దీపావళి నాడు వాటిని విక్రయించే సమయంలో ఒత్తిడి పడి ప్రమాదం సంభవించి ఒక వ్యక్తి మృత్యువాత పడ్డాడు. చాటపర్రు రోడ్డులో రెండేళ్ల క్రితం టపాసులు తయారు చేస్తున్న ఇంట్లో ప్రమాదం జరిగి ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గతేడాది అక్టోబర్ 31వ తేదీన దీపావళి రోజునే ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని గౌరీదేవి గుడివద్ద స్కూటర్‌పై ఉల్లిపాయ బాంబుల బస్తాను ఇద్దరు మధ్యలో పెట్టుకుని వెళుతుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద స్కూటర్ ఎగరడంతో ఉల్లిపాయ బాంబులు ఒత్తిడికి గురై పేలాయి. ఈ ప్రమాదంలో దుర్గాసి సుధాకర్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో ఎనిమిది మంది తీవ్ర గాయాల పాలయ్యారు. అనధికారికంగా ఉల్లిపాయ బాంబులను తయారు చేసి విక్రయించిన వ్యక్తిపై అప్పట్లోనే వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### తూతూ మంత్రంగా తనిఖీలు

జిల్లాలో ఏలూరు అగ్నిమాపక కేంద్రంలో రెండు ఫైర్ ఇంజన్లు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, నూజివీడు, భీమడోలు, కైకలూరు, కుక్కునూరులలో ఒక్కొక్క ఫైర్ ఇంజన్ ఉన్నాయి. జిల్లాలో మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలు లేకపోయినప్పటికీ వాటిని నిల్వ చేయడానికి గొడౌన్‌లను ఏర్పాటు చేసుకుని విక్రయించడానికి 15 మంది శాశ్వత లైసెన్సు కలిగి ఉన్నారు. వారు అనుమతి ఇచ్చి కేజీల కంటే ఎక్కువ నిల్వలను

(మిగతా 8వ పేజీలో)

## శ్రీ మహావిష్ణువుగా చినవెంకన్న



శ్రీవారి ఆశ్వయుజమాస బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవైకుంఠ నారాయణుడుగా చినవెంకన్న భక్తులకు దర్శనమిచ్చారు. శంఖు, చక్ర గదా ధారియై ఉభయ దేవేరులతో విశేష పుష్ప అలంకారాల్లో ఉన్న స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించు కున్నారు. తొళక్కవాహనంపై జరిగిన తిరువీధిసేవ చూపరులకు నేత్రపర్వమైంది.

- ద్వారకాతిరుమల

## 11 రోడ్లు.. రూ.30.18 కోట్లు

### ఎండీఆర్ ప్లాన్ కింద నిధులు మంజూరు

ఏలూరు,అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో పలు నియోజక వర్గాల్లో 11 ప్రధాన రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర హైవేలను అనుసంధానం చేసే ఈ రోడ్లకు రూ.30.18 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులిచ్చారు. ఎండీఆర్ ప్లాన్స్ అదనపు నిధుల మంజూరు కోసం రెండు నెలలు క్రితమే ప్రభుత్వం ప్రతిపాదనలు స్వీకరించగా, ఇంత వేగంగా నిధులను మంజూరు చేయడంపై పలు నియోజకవర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

### నిధులు మంజూరైన రోడ్లు

ఏలూరు నియోజకవర్గంలో ఏలూరు- మేడిశెట్టి వారిపాలెం 6.3 కిలోమీటర్లకు రూ.2.80 కోట్లు, ఏలూరు పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఏలూరు టౌన్ లిమిట్స్‌లో గూడ్స్‌షెడ్ రోడ్డు- ఏలూరు టౌన్ ప్రారంభం (మార్కెట్‌యార్డు) వరకు 3.26 కి.మీలకు రూ.2.60 కోట్లు, నూజివీడు నియోజకవర్గంలోని మచిలీపట్నం- నూజి వీడు- వయా కల్లూరు రోడ్డు 5.6 కి.మీలకు రూ.2 కోట్లు, గోప వరం- మీర్జాపురం 9 కి.మీలకు రూ.3.93 కోట్లు, బయ్యనగూడెం- రేగులగుంట 8.40 కి.మీలకు రూ.3కోట్లు, పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం మండలం పరిధిలో యర్నగూడెం- పొంగుటూరు ఏలూరు జిల్లా పరిధిలో 1.8 కి.మీలకు రూ.కోటి మంజూరయ్యాయి. దెందులూరు నియోజకవర్గంలో ఈజీకే రోడ్డు - డీపీ రోడ్డు వయా మలకచర్ల 4.70 కి.మీలకు రూ.2.95 కోట్లు, కేడీపురం- పైడి చింత పాడు వయా గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక 3.80 కి.మీలకు రూ.3.35 కోట్లు, కైకలూరు నియోజకవర్గంలో లోపూడి నుంచి కొత్త గూడెం రోడ్డు 2 కి.మీలకు రూ.2.35కోట్లు, చింతలపూడి నియోజకవర్గం చింతలపూడి- కామవరపుకోట 4.20 కిమీలకు రూ.1.90 కోట్లు, ఉంగుటూరు నియోజక వర్గం కైకరం- గుణ్ణంపల్లి వయా గుండుగొలను

(మిగతా 8వ పేజీలో)



కొయ్యలగూడెం మండలం యర్నగూడెం-పొంగుటూరు రోడ్డు

### అధికారితో..

## ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలో గృహ నిర్మాణాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, కొత్తగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, బిల్లులు పెండింగ్ తదితర అంశాలపై 10వ తేదీ శుక్రవారం ఉదయం 11- 12 గంటల మధ్య ' ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ ' నిర్వహించనుంది. ప్రజలు

**94928 73995**

నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు చెబితే .. వాటి పరిష్కారానికి ఏలూరు జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.సత్యనారాయణ చర్యలు తీసుకుంటారు.

## సుప్రీంలో కొల్లేరు కేసు.. 22కు వాయిదా

ఏలూరు,అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కొల్లేరు అభయారణ్యంలో ఆక్రమణల తొలగింపు, అక్కడ ప్రజలకు జిరాయితీ భూముల పంపిణీ, ఇతర అంశాలపై సుప్రీం కోర్టులో బుధవారం ఇరువర్గాలు వాదనలు వినిపించాయి. అయితే బెంచ్ తీర్పును ఈనెల 22కు వాయిదా వేసింది. కాకినాడకు చెందిన పర్యావరణవేత్త కె.మృత్యుంజయరావు కొల్లేరు అంశంపై ప్రజా ప్రయోజన వాజ్యం (పిల్) గతంలో దాఖలు చేసిన విషయం విదితమే. ప్రధానంగా ఏపీకి చెందిన అధికారులు కొల్లేరు అంశంలో పర్యావరణం, అక్కడ ప్రజల విషయంలో తీసుకున్న చర్యలకు సంబంధించి సరైన రికార్డులు సమర్పించని కారణంగా జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలో బెంచ్ తీర్పును ఈనెల 22కు వాయిదా వేసింది. అప్పటిలోగా పూర్తి సమాచారంతో రావాలని కోర్టు ఆదేశించినట్టు సమాచారం. రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే కూడా మంగళ వారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులు, ఎమ్మెల్యేలతో చర్చించినప్పటికి పూర్తి వివరాలు రాలేదు. ఇప్పటికే సుప్రీంలో ఈ కేసు పలుమార్లు వాయిదా పడుతున్న నేపథ్యంలో 15 రోజుల వ్యవధిలో 22వ తేదీ నాటికైనా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరాలు సమర్పిస్తోందో లేదో వేచి చూడాల్సిందే.

## 13న విధుల్లోకి కొత్త టీచర్లు

### నేటి ఉదయం నుంచే వెబ్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

లోపలి పేజీలో..

## మూణ్ణాళ్ల ముచ్చట!

- గాలాయగూడెం సచివాలయంలో నాసిరకం పనులు
- ప్రమాదకరంగా మారిన ఫ్లోరింగ్..
- జారి పడుతున్న ఉద్యోగులు, ప్రజలు

దెందులూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం హయాంలో గాలాయగూడెంలో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.24 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనం మూణ్ణాళ్ల ముచ్చటగా మారింది. ఏడాది క్రితమే పూర్తి చేసిన ఈ భవనం ఫ్లోరింగ్ పలుచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ కారణంగా టైల్స్ పగిలిపోవడంతో అడుగుభాగంలో మట్టి దర్శనమిస్తోంది. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ, ఉద్యా నశాఖల అధికారులు, గ్రామ రెవెన్యూ తదితర 12 మంది ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం పదుల సంఖ్యలో గ్రామస్థులు ఇక్కడకు వచ్చి జారి పడి గాయాలపాలవుతున్నారు. ఇటీవల ఒక వృద్ధుడు గుమ్మంలో

(మిగతా 8వ పేజీలో)



గాలాయగూడెం సచివాలయంలో పగిలిన ఫ్లోరింగ్



ఫ్లోరింగ్ సక్రమంగా లేకపోవడంతో గోడ సాయంతో బయటకు వెళ్తున్న ఉద్యోగిని



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

## పంట నాణ్యతపై దృష్టి సారించండి

- కోకో రైతుల సదస్సులో కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరుసిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కోకో పంట నాణ్యతపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. ఏలూరులోని కలెక్టరేట్‌లో బుధవారం కోకో సాగు, పంటకోత తర్వాత నిర్వహణలో ఆధునిక పద్ధతులపై ఒక రోజు వర్క్‌షాప్‌లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ 'దేశంలోనే జిల్లా కోకో సాగులో మొదటి స్థానంలో ఉంది. జిల్లాలోని 18 మండలాల్లో 13 వేల మంది రైతులు 36,150 ఎకరాల్లో కోకో సాగు చేస్తున్నారు. ఈ ఏడాది అదనంగా మరో 3వేల ఎకరాలు సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలి. పండిన పంటను పులియ పెట్టటం, ఎండ బెట్టడం, కోకో నాణ్యత పెంచడానికి అధునిక పరికరాల కోసం రూ.12 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించాం. కోకో ప్రాసెసింగ్ యూనిట్ల స్థాప నకు పూర్తి స్థాయిలో రుణాలు మంజూరు చేస్తాం' అన్నారు. రైతుల సందేహాలను అధికారులు, శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఏపీ ఎఫ్ పీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డా. జి.శేఖర్‌బాబు, జిల్లా ఉద్యానశాఖాధికారి కె.షాజా నాయక్, ఏపీఎంఐపీ పీడీ డా.ఎస్.రామ్మోహన్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ రాజు, ఎల్‌డీఎం డి.నీలాద్రి, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ పీఎంఎఫ్ఎంఇ జోనల్ మేనేజర్ కేజే మారుతి, ఏలూరు జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాస్, అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

### యుద్ధప్రాతిపదికన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు..

ఏలూరుసిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా అంటువ్యాధులు వ్యాపించ కుండా అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా పాఠశాలలు, వసతి గృహాలలో గురువారం నాటికి పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి ట్యాంకులు శుభ్రపరిచే పనులు పూర్తి చేయించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం పారిశుధ్యం, తాగునీటి వనరుల పరిశుభ్రత, విద్యార్థులకు ఫీవర్ సర్వే, వైద్య పరీక్షలు, జీఎస్టీ అవగాహన, సదరం క్యాంపుల నిర్వహణ తదితర అంశాలపై ఎంపీడీవోలు, కమిషనర్లు, వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. డీపీవో కొడాలి అనూరాధ, డీఎంహెచ్‌వో అమృతం తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు జాగిలాలతో తనిఖీలు



ఏలూరు క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో బుధవారం ఉదయం ఆకస్మికంగా పోలీసు జాగిలాలతో బాంబు డిస్‌పోజల్ స్క్వాడ్‌లతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అన్ని వార్డులను, ఆసుపత్రి చుట్టూ జాగిలాలతో తనిఖీలు చేశారు. ఎక్కడా ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు కొద్ది రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు, బ్రిడ్జిలు, ప్రాజెక్టులను బాంబు డిస్‌పోజల్ స్క్వాడ్, పోలీసు జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగానే సాధారణ తనిఖీలుగానే ఏలూరు ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అయితే పోలీసు జాగిలాలు ఒకేసారి ఆసుపత్రికి వచ్చి తనిఖీలు చేయడంతో రోగులు కాస్తా కంగారు పడ్డారు. విషయం తెలిసి ఊపిరి పీల్చుకున్నారు.

## కైకలూరులో డీఎల్పీవో విచారణ

కైకలూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కైకలూరులో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని ఏలూరు డీఎల్పీవో వై.అమ్మాజీ అన్నారు. కైకలూరు పంచాయతీలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి ఆనందభూషణం రూ.54 లక్షలు నిధులు దుర్వినియోగం చేసినట్టు వచ్చిన ఫిర్యాదుపై బుధవారం డీఎల్పీవో విచారణ చేశారు. ఆరు నెలల కాలంలో రూ.54 లక్షల నిధులకు సంబంధించిన బిల్లులు, ఓచర్లు పూర్తి రికార్డులను సీజ్ చేసి ఏలూరు తరలిస్తున్నామని, పూర్తిస్థాయిలో పరిశీలించి జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక అందించనున్నట్టు డీఎల్పీవో తెలిపారు. ఈ విచారణలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రవికిరణ్, పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్పీవో అమ్మాజీ

కాగా నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదని ఆనందభూషణం చెబుతున్నారు. బుధవారం కైకలూరు పంచాయతీ కార్యాలయం వద్ద విలేకరులతో పంచాయతీలో రూ.54 లక్షలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎఫ్ఎంఎస్ ద్వారానే నిధులు చెల్లింపులు జరిగాయని అయితే కొంతమంది ఉద్దేశపూర్వకంగా తనపైన బురద జల్లుతున్నారని పేర్కొన్నారు.




## కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ/పెదపాడు/పెదవేగి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 21.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 0.9 మి.మీ నమోదైంది. జిల్లాలో కేవలం కుక్కునూరులో మాత్రం 3.2 మి.మీ వర్షపాతం నమోదైంది. పెదపాడు,పెదవేగి మండలాల్లో ఉదయం నుంచి ఎండవేడి, ఉక్కపోతతో వున్న వాతావరణం కాస్త ఒక్కసారిగా మారి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పెదవేగి మండలం వేగివాడ దగ్గర ఏలూరు- జంగారెడ్డి గూడెం ప్రధాన రహదారిపై వరదనీరు కాలువలా ప్రవహించింది.

## 18 స్కూల్ బస్సులపై కేసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రవాణాశాఖ అధికారులు బుధవారం సాయంత్రం విద్యా సంస్థల బస్సులను తనిఖీల చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 18 బస్సులపై కేసులు నమోదు చేసి రూ.78,230 అపరాధ రుసుము విధించామని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ చెప్పారు. రహదారి భద్రత నియామాలను తప్పక పాటించాలన్నారు. విద్యార్థులను తరలించే విషయంలో నిబంధనలను పాటించని విద్యా సంస్థల బస్సులను, ప్రైవేటు వాహనాల బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.




విగ్రహాలతో నిండిపోయిన కోడేరు పుష్కర ఘాట్

## కోడేరు పుష్కర ఘాట్‌లో విగ్రహాలు

ఆచంట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గోదావరి వరదతో కోడేరు, పెద మల్లం, భీమలాపురం, కరుగోరుమిల్లి పుష్కరఘాట్‌లలో బురద పేరుకు పోయింది. వరద ఉధృతి అనంతరం రేవులను శుభ్రం చేసినప్పటికి కొన్ని సార్లు గోదావరి ఉధృతితో పుష్కరఘాట్‌లలో మట్టితో నిండి ఉన్నాయి. ఇటీవల దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాలను కోడేరు పుష్కరఘాట్‌లో నిమజ్జనం చేయడంతో అక్కడే ఉండిపోయాయి. భక్తులు గోదావరిలో స్నానాలు చేయడానికి వీలులేకుండా పోయింది. అధికారులు స్పందించి రేవులను శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.


మొగల్తూరు పరిధిలో పొంగిపొర్లుతున్న గొంతేరు డ్రెయిన్

## పొంగిపొర్లుతున్న డ్రెయిన్లు

మొగల్తూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా చిన్నపాటి వర్షాలకు తోడు ఎగువన పొంగుతున్న డ్రెయిన్లతో దిగువ ప్రాంతంలోని డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. డెల్టా తీరప్రాంతమైన మొగల్తూరు మండలం గొంతేరు, దర్బరేవు, వెస్ట్ కుక్కులేరు, యనమదుర్రు, ఈస్ట్ కుక్కులేరు, చింతరేవు డ్రెయిన్లు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఆయా డ్రెయిన్‌ల పరిధిలోని వ్యవసాయ భూములు, చెరువులు మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దర్బరేవు డ్రెయిన్ సమీప చేలల్లో ముంపు నీరు బయటకు లాగకపోవడంతో సార్వా సాగుకు క్రాప్ హాలిడే ప్రకటించారు. రామన్నపాలెం పంచాయతీ పరిధిలోని అడవిపల్రలో దర్బరేవు డ్రెయిన్ ముంపుతో సుమారు 1400 ఎకరాలకు కేవలం 100 ఎకరాలు మాత్రమే సాగు చేస్తున్నారు. దర్బరేవు డ్రెయిన్ ప్రక్షాళన చేయాలని రైతులు కోరుతున్నారు.


మాలవానితిప్ప వద్ద పంట కాలువలోకి వదులుతున్న చేపల చెరువు నీరు

## కాల్వలో ఆక్వా వ్యర్థ జలం

### కాలుష్యం కోరల్లో బొండాడ పంట కాలువ

కాళ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో సుమారు పది గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందించే బొండాడ పంట కాల్వ చేపల చెరువుల నీటితో కలుషితమవుతోంది. ఒకపక్క పంట కాలువలను పరిరక్షించాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు పటిష్ట చర్యలు చేపడుతుంటే మరోపక్క ఆక్వా రైతులు నిర్లక్ష్యంగా ఆక్వా వ్యర్థ జలాలు పంట కాలువలోకి వదిలేస్తున్నారని శివారు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాలవానితిప్పలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక ఆక్వా రైతు పంట కాలువలోకి కలుషిత నీరు వదిలినా ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డిప్యూటీ స్పీకర్ ఆదేశాలతో కాలువను పూర్తి స్థాయిలో బాగు చేశారని, కొంత మంది ఇలా కలుషితం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో కనీస పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని, మండల పరిధిలో ఈ కాలువ వెంబడి ముగ్గురు నీటి సంఘం అధ్యక్షులున్నా కలుషితం కాకుండా చూడలేకపోతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. కలుషిత నీరు కనీసం వాడుకోవడానికి కూడా ఉపయోగపడడం లేదని, పశువులు కూడా తాగడం లేదని శివారు గ్రామ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, నీటి సంఘం అధ్యక్షులు వెంటనే స్పందించి చేపల చెరువు నీటిని పంట కాలువలోకి వదలకుండా తగు చర్యలు తీసుకోవాలని శివారు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రి ఎదురుగా రోడ్డుపై సూచిక బోర్డు

## ఆ రోడ్డుపై జాగ్రత్త..

ద్వారకాతిరుమల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రానికి వచ్చే రహదారి తూట్లు పడినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడంతో కొందరు వినూత్నంగా రహదారిపై సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద గుంతల్లో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుండడంతో బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. దాదాపు ఏడు ప్రాంతాల్లో ఎర్రజెండాలతో సూచిక బోర్డులను ఉంచారు. ద్వారకాతిరుమల, గొల్లగూడెం, పంగిడిగూడెం, తదిరత చోట్ల రోడ్డు ఛిద్రమైంది. ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రి వద్ద సూచిక బోర్డు 'గుంత' చెబుతున్నట్లు వినూత్నంగా ఉండి అధికారులను ఆలోచింపచేస్తోంది.

### నన్ను బాగు చేయండి..

గుంత మాట్లాడితే ఎలా ఉంటుందో మీరే చూడండి.. ఇది అజ్ఞాత వ్యక్తులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డు సారాంశం.

'ఈ మార్గంలో వెళ్లే వారికి నేను గాయాలు చేస్తున్నాను. నేను ప్రభుత్వాన్ని ప్రాధేయపడుతున్నాను. వాహనదారులకు మరో పెద్దగాయం చేసేలోగా దయచేసి నన్ను బాగుచేయండి.' రోడ్ సేఫ్టీ పేరుతో ఎర్ర జెండాలతో ఇలా బోర్డు ఏర్పాటు చేయడం, గుంతల వద్ద ఇది హెచ్చరికలా పనిచేస్తోంది. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది.

# శాస్త్రోక్తంగా శ్రీచక్రవార్యుత్సవం


ధ్వజస్తంభం వద్ద గరుడపటాన్ని దింపిన అర్చకులు

- శేషాచలంపై బ్రహ్మోత్సవ సందడి

ద్వారకాతిరుమల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీచక్రవార్యుత్సవం బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా జరిగింది. స్వామివారి ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో చక్రవార్యుత్సవం, మౌన బలి, సాయంత్రం ధ్వజావరోహణ జరిగాయి. శ్రీవారి ఉత్సవ వైభవాన్ని వీక్షించేందుకు వచ్చిన సర్వాది దేవతలకు ఉద్వాసన పలికే క్రమంలో ధ్వజ స్తంభంపై ఎగురవేసిన గరుడ పటాన్ని శాస్త్రోక్తంగా కిందికి దింపడమే ధ్వజావరోహణ.

### శ్రీచక్రవార్యుత్సవం ఇలా..

ఆలయ ఆవరణలో శ్రీవారు, అమ్మవార్లు, చక్రపెరుమాళ్లను ఒక వేదికపై ఉంచారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యహవాచన జరిపారు. పూజాధికాల అనంతరం సుగంధ ద్రవ్యాలు, పంచ పల్లవులు, శ్రీచందనం, పసుపు, మంత్రపూత జలంతో శ్రీచక్రస్వామిని అభిషేకించారు. అనంతరం పంచామృతాభిషేకాన్ని జరిపి హారతులు ఇచ్చారు. అర్చకులు అభిషేక జలాన్ని భక్తుల శిరస్సులపై జల్లారు. పూర్ణాహుతి హోమాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహించిన అనంతరం సర్వాదిదేవతలకు ఉద్వాసనగా ధ్వజావరోహణ భక్తులకు నేత్రపర్వమైంది.


### శ్రీవారి గ్రామోత్సవం

చినవెంకన్న ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు, ఉభయదేవేరులతో ప్రతీ నిత్యం వివిధ వాహనాలపై భక్తులను కటాక్షిస్తున్నారు. బుధవారం ఉదయం తొళక్క వాహనం, రాత్రి అశ్వవాహనంపై క్షేత్రపురవీథుల్లో ఊరేగారు.


అశ్వవాహనంపై దివ్యమూర్తులు




# మందులు మింగేస్తున్నారా?



**చిన్నపాటి జ్వరమే కదా.. డాక్టరు దగ్గరకు వెళ్లడం దేనికి.. మందులు వాడేద్దాం.. చాలామంది ఇలాగే ఆలోచిస్తున్నారు. ఇలా చేయడం ప్రాణానికి ముప్పు. ప్రధానంగా చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు మరింత జాగ్రత్తగా ఉండాలి. అవగాహనాలేమి, ఆర్థిక ఇబ్బందులు, దూరాభారం వంటి సమస్యలతో సొంత వైద్యంతో పిల్లల ప్రాణాలమీదికి తెస్తున్నారు. మితిమీరిన మందుల వాడకం, యాంటీబయాటిక్స్‌తో పిల్లలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. పిల్లలకు దగ్గు మందు వాడకంలో జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరికలు చేస్తున్నారు.**

## ఉసురు తీస్తున్న విచ్చలవిడి మందుల వాడకం

- ప్రాణాలమీదికి తెస్తున్న అవగాహన లేమి
- సొంత వైద్యం వద్దంటున్న వైద్యులు
- పెరిగిన యాంటీబయోటిక్స్ వినియోగం
- దగ్గు మందు వాడకంలో అజాగ్రత్త

పెదవేగి/పాలకోడేరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలపై వైద్యులను సంప్రదించకుండా మందుల వాడడం ప్రాణాంతకం. చిన్నపాటి అనారోగ్య సమస్య ఉంటే మందుల దుకాణంలో తెచ్చిన మందులు వాడడం శ్రేయస్కరం కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల మధ్య ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో దగ్గు మందు వాడిన చిన్నారులు మృత్యువాత పడ్డారు. దీనితో రెండేళ్లలోపు చిన్నారులకు దగ్గు సిరప్ వాడకాన్ని నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. చిన్నపిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి సహజంగా ఉంటుందని, పరిమితికి మించి మందులు వాడితే నిరోధక శక్తి సన్నగిల్లుతుందని వైద్యులు వివరిస్తున్నారు.

### ముక్కు మూసి మందు వేస్తే..

పిల్లలు మందులు వేసుకోవడానికి మారాం చేస్తారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లల ముక్కు మూసి మందు ద్రావణాన్ని నోట్లో వేస్తుంటారు. ఇది చాలా ప్రమాదమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముక్కుమూసి మందు వేస్తే ఊపిరితిత్తుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. చిన్నారులకు విరేచనాలు అయితే మందులు ఒక్కటే మార్గం కాదని, విరేచనాలు, వాంతుల కారణంగా శరీరంలో నీటిశాతం పడిపోతుందని, ఈ సమయంలో ద్రవరూపంలో శరీరానికి నీరు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు స్పష్టంచేస్తున్నారు.

### యాంటీబయోటిక్స్

ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకు యాంటిబయాటిక్స్ వాడకం మంచిది కాదు. వైద్యుల సూచనలు లేకుండా యాంటీబయాటిక్ మందులు చిన్నపిల్లలకు అసలు ఇవ్వకూడదు. చాలామంది ఆర్ఎంపీలు, పీఎంపీల దగ్గరకు వెళ్లి యాంటీబయాటిక్స్ వాడుతున్న సంఘటనలు కోకొల్లలు. వైద్యులను సంప్రదించకుండా యాంటీబయాటిక్స్ వేసుకోవడం భవిష్యత్‌లో మరిన్ని ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది.

### నాణ్యతాప్రమాణాలు చూడాలి

ఇటీవల మార్కెట్‌లో నాసిరకం మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఔషధ నియంత్రణ శాఖాధికారులు పలుచోట్ల దాడులు జరిపి నాసిరకం మందులను సీజ్ చేసిన దాఖలు ఉన్నాయి. ఇలాంటి మందుల వాడకంకూడా ప్రమాదకరమని వైద్యులు చెప్తున్నారు. నాసిరకం మందుల వాడకంపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. వైద్యులు ఇలాంటి మందుల వాడకాన్ని ప్రోత్సహించవద్దని ఔషధ నియంత్రణ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

### చిన్నారులకు ప్రభుత్వ టీకాలు

ప్రభుత్వం శిశు మరణాలను తగ్గించే విధంగా పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వరకు వ్యాధి నిరోధక టీకాలను అందిస్తోంది. బిడ్డ పుట్టిన వెంటనే క్షయ నివారణకు బీసీజీ టీకా, కాలేయ వ్యాధి నివారణకు హెపటైటిస్-బి, పోలియో రాకుండా పోలియో చుక్కలు వేస్తోంది. నెలన్నరకు మొదటి డోస్ కింద పోలియో చుక్కలు, ఐపీవీ టీకా, కోరింత దగ్గు, కంఠవాతం, ధనుర్వాతం, మెనింజైటిస్ రాకుండా టీకా, రెండున్నర నెలల్లో ఓపీవీ, పెంటా వ్యాక్సిన్, రోటా వైరస్ అందిస్తున్నారు. మూడున్నర నెలల్లో ఓపీవీ, ఐపీవీ టీకా, పెంటా వ్యాక్సిన్, పీసీవీ వ్యాక్సిన్, రోటా వ్యాక్సిన్ అందిస్తున్నారు. 9 నెలలు నిండాక ఐపీవీ, పీసీవీ, తట్టు, పొంగు నివారణకు ఎంఆర్ టీకా, బ్రెయిన్ ఫీవర్ నివారణకు జేఈ టీకా అందిస్తుంది. ఐదో సంవత్సరంలో విటమిన్ -ఎ, డీపీటీ, ఎంఆర్ టీకాలు అందిస్తారు.

### పిల్లల వయస్సు, బరువు కీలకం



వ్యాధికి గురైన వారికి వైద్యం అందించే సమయంలో వయసుతో పాటు బరువు, ఎత్తు కూడా పరిగణనలోకి తీసుకోవాలి. బరువు, వయస్సు ఆధారంగా మందు మోతాదు ఉంటుంది. పిల్లల్లో వ్యాధి నిర్ధారణ అనంతరం డాక్టర్ సూచించిన మందులు పూర్తిగా వాడాలి. మధ్యలో మానేస్తే వ్యాధి కారక జీవి మరింతగా విజృంభించే ప్రమాదం ఉంది.

- డాక్టర్ ఎస్.అల్బర్ట్, ఏలూరు

### చీటీ లేకుండా దగ్గు మందు వద్దు



చిన్న పిల్లలకు దగ్గు తీవ్రమైతే డాక్టర్ పర్యవేక్షణలో సిరప్ తాగించాలి. పాత చీటీ చూపించి అవే సిరప్ కొనకూడదు. వయస్సు, బరువు ఆధారంగా మందు పరిమాణం మారుస్తారు. దగ్గుతో పాటు జలుబు, జ్వరం ఉన్నప్పుడు సిరప్ ఒకే దాంట్లో ఉంటుందనే డాక్టర్ అప్పటి పరిస్థితిని బట్టి చీటి రాస్తారు. వేర్వేరుగా సిరప్‌లు వాడడం ఉత్తమం.

- డాక్టర్ పీఏఆర్ఎస్.శ్రీనివాస్, ఏలూరు

### ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి



చిన్నారులకు తల్లిపాలే అమృతం. పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టాలి. బిడ్డకు ఆరు నెలలపాటు తల్లిపాలు పట్టించాలి. తల్లిపాలతో చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. తద్వారా రోగాలను నివారించుకోవచ్చు. ఆరు నెలలు వచ్చే వరకు ఎటువంటి ఆహారం ఇవ్వవద్దు. తల్లిపాలే పట్టిస్తూ పిల్లల ఆరోగ్యానికి భద్రత కల్పించండి.

- డాక్టర్ ఎస్.కృష్ణదుర్గ, యూపీహెచ్‌సీ, దుర్గాపురం

### డాక్టర్‌ను సంప్రదించండి



వైద్యులను సంప్రదించకుండా మందుల షాపుల్లో వెళ్లి మందులు వాడొద్దు. ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఆసుపత్రులను తీసుకువచ్చింది. వైద్యుని సలహా తీసుకుని మందులు వాడాలి. చిన్న పిల్లలకైతే వెంటనే మందులు వాడొద్దు. కొన్ని రోజులు చూసిన అనంతరమే వైద్యుడి సలహా మేరకే మందులు వాడండి.

- డాక్టర్ హసిత, యూపీహెచ్‌సీ, దుర్గాపురం

# కలల పండుగ



**కలల రాకుమారుడు భర్త కావాలని యువతులు, కట్టుకున్న భర్త క్షేమం కోరే వివాహితలు చేసే పండుగ అట్లతద్ది. అశ్వయుజ బహుళ తదియ నాడు స్త్రీల పండుగ. ఉయ్యాల పండుగ.. గోరింటాకు పండుగ అని కూడా అంటారు. గౌరీదేవి శివుని భర్తగా పొందాలని కృతనిశ్చయంతో ఉండడంతో త్రిలోక సంచారి నారదుడు ఆమెకు అట్లతద్ది వ్రతం చేయమని సూచిస్తాడు. పార్వతిదేవి పూజలను గౌరీ వ్రతంగా మహిళలు ఆచరిస్తారు.**

## నేడు అట్ల తద్ది

పోలవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నోముల పంట పండించే పండుగను అట్లతద్ది అని కూడా పిలుస్తారు. తెలుగువారి పండుగలలో ఇది ఒకటి. అట్ల తద్దె ఆరట్లు.. ముద్ద పప్పు మూడట్లు.. అంటూ ఆడపడుచులకు బంధువులకు ఇరుగు పొరుగులకు వాయనాలివ్వడం ఆనవాయితీ. రోజంతా కఠిక ఉపవాసం ఉండి సాయంత్ర సమయంలో వాయినాలు ఇచ్చి నైవేద్యాలు పూర్తి చేసుకుని గోపూజకు వెళ్లి అటు నుంచి గోదావరి, చెరువు, కాల్వల్లో దీపాలు వదిలి చెట్లకు ఊయలలు కట్టి ఊగడం చేయడం స్త్రీల ఆచారం.

ఈ పండుగలో చంద్రారాధన ప్రధానమైనది. చంద్రకళల్లో కొలువైవున్న శక్తి అనుగ్రహంతో స్త్రీ సౌభాగ్యం పెరుగుతుందని, సుఖశాంతులు వర్ధిల్లుతాయని నమ్మకం. అట్లు నైవేద్యంగా పెట్టడంలో అంతరార్థమేమిటంటే నవగ్రహాల్లో ఒకటైన కుజుడికి అట్లంటే మహా ప్రీతి ఆయనకు నేవైద్యం పెట్టడం వలన కుజదోష పరిహారమై సంసార సుఖంలో ఎటువంటి అడ్డంకులు రావని, రజోదయమునకు కారకుడు కావడం వలన రుతుచక్రం సరిగా ఉంచి రుతు సమస్యలు, గర్భధారణ సమస్యలు, గర్భస్రావం కాకుండా కుజుడు కాపాడుతాడని నమ్ముతారు.

### వ్రత విధానం ఇలా..

అట్లతద్ది రోజు ముందు రోజు కాళ్లు చేతులకు అందంగా గోరింటాకు పెట్టుకుని గుమ్మాలకు తోరణాలు కడతారు. ఆడవారు తెల్లవారుజామున తలారా స్నానం చేసి రాత్రి సిద్ధం చేసిన చద్ది అన్నం గోంగూర పచ్చడితో భోజనం చేసి ఉపవాసం ఉంటారు. ఇంట్లో తూర్పు దిక్కున మండపం పెట్టి గౌరీదేవి పూజ చేసి ధూప, దీప, నేవైద్యాలు పెట్టి వినాయక పూజ తర్వాత



గౌరీ పూజ స్తోత్రం శ్లోకాలు, పాటలు పాడడం చేస్తారు. సాయంత్రం చంద్రదర్శనం తర్వాత మళ్లీ గౌరీపూజ చేసి 11 అట్లు 11 రకాల ఫలాలు నైవేద్యంగా పెట్టి ముత్తైదువులకు అలంకారం చేసి వాయినాలు ఇస్తారు. ఇస్తినమ్మ వాయినం పుచ్చు కుంటినమ్మ వాయినం అంటూ పాడుతారు. ముత్తైదువులకు నల్లపూసలు, లక్కకోళ్ళు రవికల గుడ్డ, దక్షిణ తాంబూలాలు ఇచ్చి తాము కూడా భోజనం చేస్తారు.

### కోరుకున్న వాడి పేరు చెప్పాల్సిందే..!

కన్నెపిల్లలను ఊయలలెక్కించి వేగంగా ఊపుతూ కోరుకున్న వాడి చెబితే గానీ వదలరు. సరదాగా అభిమాన హీరో, క్రికెటర్ పేరు చెప్పి యువతులు తప్పించుకుంటారు. కన్నెపిల్లలంతా లయబద్ధంగా చేసే అట్లతద్ది నాట్యం చూపరులను భలే ఆకట్టుకుంటుంది.

## భారత పారా త్రో బాల్ జట్టు మేనేజర్‌గా యడ్లపల్లి



అత్తిలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక రత్నాపుర్ ఇండోర్ స్టేడియంలో డిసెంబరులో సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే భారత పారా త్రో బాల్ జట్టు మేనే జర్‌గా అత్తిలికి చెందిన యడ్లపల్లి సూర్యనారా యణ ఎన్నికయ్యారని ఏపీ పారా త్రోబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గండా కైలాష్ రెడ్డి బుధవారం తెలిపారు. ఆగస్టు 30నుంచి 31 వరకు కోయంబత్తూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న ఆంధ్ర పారా త్రో బాల్ జట్టుకు సూర్యనారాయణ మేనేజర్‌గా వ్యవహరించారని తెలిపారు. ఈ పోటీలలో రాష్ట్ర జట్టు విజేతగా నిలిచిందని కైలాష్ తెలి పారు. శ్రీలంకలో జరిగే ఏషియన్ పారా త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌కు తనపై నమ్మకం ఉంచి మేనేజర్‌గా అవకాశం కల్పించిన పారా సిట్టింగ్ త్రో బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఆల్బర్ట్, ఆంధ్ర పారా త్రో బాల్ కార్యదర్శి కైలాష్ రెడ్డికి యడ్లపల్లి సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

## రేపు ఉమ్మడి జిల్లా క్రీడా జట్ల ఎంపికలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అండర్-14, 17 విభాగాల్లో జిల్లా క్రీడా జట్ల ఎంపికల షెడ్యూలు ఖరారైంది. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు, డీఈవో వెంకటలక్ష్మమ్మ, జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ బుధవారం వివరాలు తెలిపారు. ఈ నెల 10న ఉదయం 9గంటలకు కొవ్వలి జడ్పీ హైస్కూలులో బాస్కెట్‌బాల్, ఏలూరు ఇండోర్ స్టేడియంలో రెజ్లింగ్ క్రీడల్లో ఎంపికలు జరుగుతాయని వివరించారు. క్రీడాకారులు వారు చదువుతున్న స్కూలు హెచ్ఎం సంతకంచేసిన ఎంట్రీఫారం తెచ్చుకోవాలని, దీంతోపాటు క్రీడా దుస్తులు, వాటర్ బాటిల్ కూడా తెచ్చుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ నంబరు 90308 94311లో సంప్రదించాలని కోరారు.


సినిమాకు క్లాప్ కొడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

## రాచర్లలో మహానాగ సినిమా షూటింగ్

పెంటపాడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మహానాగ సినిమా విజయవంతం కావాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మండలంలోని రాచర్ల గ్రామంలో మహానాగ సినిమా చిత్రీకరణకు బుధవారం ఆయన క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సినిమా డైరెక్టర్ ఉదయభాస్కర వాగ్దేవి మాట్లాడుతూ ప్రముఖ నటుడు సుమన్‌తో పాటూ రమాకాంత్, శ్రావణి, శ్రీకావ్య, బస్టాప్ కోటేశ్వరరావు, జబర్దస్త్ అప్పారావు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారన్నారు. సినిమాను ప్రేక్షకులందరూ థియేటర్లకు వచ్చి చూసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబికా కృష్ణ, బేతిన గిరిధర్, పాలూరి వెంకటేశ్వరరావు తదితరుల పాల్గొన్నారు.


ఎంపికైన జిల్లా జట్లతో వ్యాయామోపాధ్యాయులు

## ఉమ్మడి జిల్లా అండర్- 19 క్రీడా జట్ల ఎంపిక

పెదవేగి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) 19ఏళ్ల విభాగం ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బుధవారం జరిగాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బాడ్మింటన్, చెస్, యోగాసన పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేశామని జిల్లా కార్యదర్శి కె.జయరాజుతెలిపారు. ఎంపికైన జిల్లా జట్లు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఆయన తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఏవీ.శివప్రసాద్, హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల ఏవో కరుణానిధి, పీడీలు రాజా, శ్రీనివాస్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

# సంకల్పం ఉంటే ఏదైనా సాధించగలం

- నల్లజర్ల మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే వెంకట్రాజు
- 1800 మంది నిరుద్యోగులు హాజరు.. 315 మంది ఎంపిక

నల్లజర్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):దృఢ సంకల్పం, నిరంతర కృషితో జీవితంలో ఏదైనా సాధించగలమని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ఎమ్మెల్యే సారథ్యంలో నల్లజర్ల హైస్కూల్‌లో 30 కంపెనీలతో బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 1800 మంది నిరుద్యోగులు హాజరు కాగా 315 మందికి ఆఫర్ లెటర్లు అందించారు. ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. సీఎం చంద్రబాబు యువతకు నైపుణ్యం పెంచేందుకు 2014 పాలనలో అనేక సెంటర్లు ఏర్పాటు చేశారన్నారు. మంత్రి లోకేశ్ ఆదేశాల మేరకు యువతకు నైపుణ్యం పెంచి ఉద్యోగావకాశాలు కల్పించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. వచ్చే నాలుగేళ్లలో గోపాలపురంలో నిరుద్యోగ సమస్య లేకుండా స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు మాట్లాడుతూ నల్లజర్లలో 100 కుటుంబాలు అమెరికాలో స్థిరపడ్డాయని, అందుకు కారణం నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాలే అన్నారు. ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, పసుమర్తి రతీష్, యలమాటి శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు, షేక్ మీరా సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.



### రిలయన్స్‌లో ఉద్యోగం : డి.వేణు, గోపాలపురం

నేను డిగ్రీ పూర్తి చేసి రెండేళ్లయ్యింది. అనేక పరిశ్రమలకు ఇంటర్వ్యూలకు వెళ్లా. జాబ్ దొరకలేదు. ఎన్నో ఇబ్బందులు పడ్డా. నల్లజర్ల జరిగిన జాబ్‌మేళాలో నెలకు రూ.15 వేలు జీతంతో బెంగళూరులో రిలయన్స్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్‌లో ఉద్యోగం వచ్చింది.



### టాటాలో ఉద్యోగం : మిద్దే జాహ్నవి, పుల్లలపాడు

నేను ఇంటర్ వరకు చదువుకున్నా. ఉద్యోగాల కోసం హైదరాబాదు, బెంగళూరు వంటి సిటీలకు వెళ్లి కంపెనీల చుట్టూ తిరగనవసరం లేకుండా నల్లజర్లలోనే జాబ్‌మేళా నిర్వహించడం ఆనందంగా వుంది. నాకు బెంగళూరు టాటా కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నెలకు రూ.13 వేలు జీతం.


టెక్రియా 2025 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి

# నేటి నుంచి నిట్‌లో టెక్రియా 2025

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 8(ఆంధ్ర జ్యోతి):విద్యార్థులలో వైజ్ఞానిక స్పృహను పెంచేందుకు టెక్రియా వంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిగూడెం నిట్‌లో 19, 11 తేదీలలో నిర్వహించే టెక్రియా 2 కే 25ను ప్రాంగణంలో దినేష్ కర్టెన్ రైజర్ కార్యక్రమంతో ప్రారంభించారు. కో ఆర్డినేటర్‌గా అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి వ్యవహరించారు. విద్యార్థుల నృత్యాలు, ఆటపాటలు అలరించాయి. టెక్రియాలో రోబోటిక్స్, ఆటోమేషన్, అల్టిమేట్ డ్రోన్, డ్రోన్ చాలెంజ్, సెరినిటి రూం, ఇంజనీర్స్ డ్రైవ్‌వే తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# ముగిసిన హార్టీ సెట్ కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలో బీఎస్సీ హార్టీకల్చర్ (హానర్స్) కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన హార్టిసెట్ కౌన్సెలింగ్ బుధవారం పూర్తయింది. కౌన్సెలింగ్‌లో రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు 66 మందికి ప్రవేశ పత్రాలు అందించారు. విశ్వ విద్యాలయ అధికారులు పాల్గొన్నారు.



ప్రవేశ పత్రాలు అందిస్తున్న రిజిస్ట్రార్

# సంక్షేమ ఫలాలు అందుతున్నాయా?

## ప్రజలకు రాష్ట్రీయ జన సంక్షేమ సేన బహిరంగ లేఖ

పాలకొల్లు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వంలోని పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు వెనుకబడిన అన్ని సామాజిక వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయా? లేదా? అనే అంశాలపై రాష్ట్రీయ జన సంక్షేమ సేన దృష్టి సారించింది. ఈ మేరకు ప్రజాభిప్రాయాన్ని కోరుతూ అధ్యక్షుడు చేగొండి హరిరామజోగయ్య బుధవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. 2024లో జరిగిన ఎన్నికల్లో అధికారంలో వచ్చిన కూటమి పార్టీలు మేనిఫెస్టో మేరకు హామీలు అమలుపై అభిప్రాయాలు చెప్పాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన సామాజిక వర్గాల సంక్షేమమే ధ్యేయంగా అధికార పార్టీలు చేసిన వాగ్దానాలు, ఎన్ని అమలు చేశారు పరిశీలించాలన్నారు. ప్రారంభించి ఇంకా పూర్తి చేయాల్సినవి, అమలైన వాటిలో లబ్ధిదారులకు నిర్దేశిత అర్హతలు ఉన్నాయా.. ఏవైనా మార్పులు చేయాలా అనే అంశాలపై సమాచారాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. సమాచారాన్ని అధ్యక్షుడు, రాష్ట్రీయ జన సంక్షేమ సేన సెల్ నంబర్లు 98486 34249, 92914 64646 తెలియజేయాలని జోగయ్య పేర్కొన్నారు.

### పారా లీగల్ వలంటీర్లు వారధిగా పనిచేయాలి

ఏలూరు క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వలంటీర్లు కక్షిదారులు, న్యాయ సేవాధికార సంస్థకు వారధిగా పనిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార భవనంలో పారా లీగల్ వలంటీర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ వివిధ చట్టాలపై అవగాహన కలిగించారు.





# అండర్ కరెంట్ షాక్

- పేరుపాలెం బీచ్‌లో పొంచి ఉన్న ముప్పు
- ఏటా 20 మందికి పైగా బలి

(మొగల్తూరు-ఆంధ్రజ్యోతి)

వినోదం పేరుతో సాగర తీరానికి వచ్చే పలు కుటుంబాల్లో విషాదం నెలకొంటోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే పేరుగాంచిన పేరుపాలెం, కేపీపాలెం సాగర తీరానికి నిత్యం భారీ సంఖ్యలో సందర్శకులు, యువతీ, యువకులు రావటం పరిపాటి. సాగరతీరం వెంబడి గల ఇసుక తిన్నెలు, కొబ్బరి, సరుగుడు తోటల్లో ఆటపాటలతో గడిపితే ప్రమాదం లేదు. ఇలాంటి వారు సురక్షితంగానే ఇంటికి వెళుతున్నారు. అసలు ప్రమాదమంతా సముద్ర స్నానానికి దిగిన వారితోనే.. ఆదివారం, ఇతర సెలవు దినాల్లో, కార్తీక మాసంలోనూ సరదాగా తీరం నందు గడపటానికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలో అనేక ప్రాంతాల నుంచి భారీగా సందర్శకులు, యువతీ, యువకులు ముఖ్యంగా విద్యార్థులు తీరానికి చేరుకుంటున్నారు. సముద్ర స్నానానికి దిగితే ఇక్కడ వచ్చే అలల ఉధృతికి కొట్టుకుపోయి విగత జీవులుగా మారి తీరానికి కొట్టుకు వస్తున్నారు. ఇలా రెండు దశాబ్దాలుగా ఏడాదికి 10 నుంచి 20 మంది పైబడి యువకులు సముద్ర స్నానానికి దిగి గల్లంతై మృతి చెందారు.

### అండర్ కరెంట్ అంటే..

పేరుపాలెం సముద్రంలో సముద్ర స్నానానికి దిగిన వారి కాళ్ళ కింద నుంచి ఇసుక నీళ్ళలో కొట్టుకుపోయి వెంటనే ఆ ప్రాంతంలో పెద్ద గొయ్యి ఏర్పడి అకస్మాత్తుగా పడిపోతుంటారు. దీంతో వచ్చే కెరటాల ఉధృతిని తట్టుకుని కెరటం వస్తే గంతెయ్యకపోతే కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. మద్యం సేవించిన వారిలో అత్యధికంగా గల్లంతై మృతి చెందుతున్నారు. సముద్రంలో దిగిన యువకులు బంతాటల కోసం ఎగరడం, కెరటాల ఉధృతితో అధిక నీరు సేవించి ఉక్కిరిబిక్కిరై మృతి చెందుతున్నారు.

### దుఃఖ సాగరంలో కుటుంబాలు

కుటుంబంలో ఒకే ఒక్క కుమారుడు కలిగి ఉండే ఈ రోజుల్లో అతనిపై ఎన్నో ఆశలు పెట్టుకుంటున్న ఆ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఇంజనీరింగ్, వైద్య విద్య వంటి ఉన్నత చదువులు చదివిస్తున్నారు. అయితే తల్లిదండ్రులను కలలను సాకారం చేయాల్సిన వయస్సులో విద్యార్థులు, యువకులు తల్లిదండ్రులకు తెలియకుండా కేపీపాలెం, పేరుపాలెం సాగర తీరాలకు చేరుకుని సముద్ర స్నానం చేస్తూ మృత్యువాత పడుతున్నారు. ఈ సంఘటనలు జరిగిన సమయంలో ఎక్కడెక్కడో ఉండే తల్లిదండ్రులు ఇక్కడకు వచ్చి మృతదేహం దొరికే వరకూ వేచి చూడటంతోపాటు మృతి చెందిన కుమారుడిపై పెట్టుకున్న ఆశలు గంగపాలు కావడంతో తీవ్ర మనోవేదన అనుభవిస్తున్నారు.

ఇక్కడ ప్రాణ నష్టం ఉండటంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి బాధిత కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ స్నానాలకు అనుమతించకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సభలో పాల్గొన్న మాజీ డీజీపీ మాలకొండయ్య, మాజీ హోం సెక్రటరీ గౌతమ్ కుమార్, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కిశోర్

# రిటైర్మెంట్ జీవనం ఆనందంగా సాగాలి

## ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):'విధి నిర్వహణలో ప్రజా సేవకు అంకితమయ్యారు.. పదవీ విరమణ తర్వాత ఆరోగ్యంగా కుటుంబాలతో సంతోషంగా జీవించాలి' అని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆకాంక్షించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం 7వ వార్షికోత్సవం ఏలూరు రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘ భవనంలో బుధవారం నిర్వహించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ మాట్లాడుతూ రానున్న పోలీస్ కానిస్టేబుళ్ళ ట్రైనింగ్ సమయంలో మాజీ అధికారుల సేవలను వినియోగించుకుంటామన్నారు. మాజీ హోం సెక్రటరీ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ పి.రత్నయ్య మరణం బాధాకరమని కన్నీటి పర్యంతమయ్యారు. మాజీ డీజీపీ ఎం.మాలకొండయ్య, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు పీవీఎస్‌కె భగవాన్‌రాజు, కార్యదర్శి ఎస్.దాశరథి, ఎల్. సత్యనారాయణ, కె.రాజగోపాల్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీ సురేష్ చంద్ర బహుగుణ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు 12 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 15 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పలువురు రిటైర్డ్ సీనియర్ అధికారులను సన్మానించారు.


పాల్గొన్న రిటైర్డ్ పోలీసు అధికారులు

# 13న విధుల్లోకి కొత్త టీచర్లు

## నేటి ఉదయం నుంచే వెబ్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

ఏలూరు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ-2025 టీచర్లకు నిర్వహిస్తోన్న ఇండక్షన్ ట్రైనింగ్ ముగింపు దశకు చేరుకోవడంతో గురువారం పోస్టింగ్స్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి విద్యాశాఖ కసరత్తును పూర్తి చేసింది. ప్రస్తుతం కొత్త టీచర్లకు శిక్షణనిస్తున్న సెంటర్లలోనే వెబ్ కౌన్సెలింగ్‌ను గురువారం ఉదయం నుంచి నిర్వహించడానికి ఉమ్మడి జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఎంచుకున్న పాఠశాలలకు నియామక పత్రాలను ఈ నెల 13 లేదా ఒకరోజు ముందుగా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునేలా వెసులుబాటు కల్పిస్తున్నారు. వెబ్ కౌన్సెలింగ్ నిర్వహణ మొత్తం రాష్ట్రస్థాయిలోనే పాఠశాల విద్య కమిషనరేట్ కేంద్రంగా జరుగుతుంది. జిల్లాలో పర్యవేక్షణ మాత్రం చేస్తారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1026 వెకెన్సీల జాబితాను ఖరారు చేశారు. ముఖ్యంగా కుక్కునూరు, వేలేరు పాడు, పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి వంటి ఏజెన్సీ మండలాల్లో వెకెన్సీలు ఎక్కువ వున్నాయి. ప్లెయిన్ మండలాల్లో స్వల్పంగా ఉన్నాయి. ఆ ప్రకారం 834 వెకెన్సీలు జడ్పీ/ ఎంపీపీ/ ప్రభుత్వ యాజమాన్యంలో కొత్త టీచర్లు ఎంచుకునేలా జాబితాను ఖరారు చేశారు. ఇక ఉమ్మడి జిల్లాలోని 7 పురపాలక సంఘాల్లో మొత్తం 148 వెకెన్సీలు, ఏలూరు నగరపాలక సంస్థ యాజమాన్యంలో 44 వెకెన్సీలు కౌన్సెలింగ్‌లో ప్రదర్శిస్తారు. డీఎస్సీ దరఖాస్తు సమయంలో అభ్యర్థి ఎంచుకున్న యాజమాన్యం నుంచే వెకెన్సీలకు అభీష్టాన్ని తెలపాల్సి ఉంటుంది. ఈ జాబితాల ప్రకారమే పోస్టింగ్స్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తారు. జిల్లాలో కేటగిరీ-3, 4 విభాగాల్లోని వెకెన్సీలను భర్తీచేసిన తర్వాతే మిగతా కేటగిరీల ఖాళీలను ప్రదర్శిస్తారు. ఇక జువనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏలూరు శనివారపుపేటలో నిర్వహిస్తోన్న ప్రభుత్వ బాలుర వసతిగృహం పాఠశాలలో టీచర్ల నియామకాలకు డీఎస్సీలో నోటిఫై చేసిన 7 పోస్టులకు కౌన్సెలింగ్‌తో నిమిత్తం లేకుండా నేరుగా నియామకాలు జరుపుతారు. కొత్త టీచర్లంతా ఈ నెల 13న విధుల్లో చేరాల్సి ఉంటుంది.

### మున్సిపల్ టీచర్లు... జాయినింగ్ సర్‌ప్లస్!

డీఎస్సీ దరఖాస్తు సమయంలో ఏలూరు నగరపాలక సంస్థ, మరో 7 పురపాలక సంఘాలకు నోటిఫై చేసిన పోస్టులకు ఆప్షన్ ఇచ్చి, ఆ మేరకు నియామకాలు పొందిన కొత్త టీచర్లకు విచిత్ర పరిస్థితులు ఎదురు కానున్నాయి. ఆయా పాఠశాలల్లో సర్‌ప్లస్ ఉపాధ్యాయులు ఇప్పటికే ఇబ్బడిముబ్బడిగా ఉన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో అదనంగా సుమారు 90 మంది ఉండిపోవడంతో ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే క్లస్టర్ టీచర్లుగా ఎంపిక చేసిన క్లస్టర్ పాఠశాలల్లో రిజర్వ్‌లో ఉంచారు. ఆ మేరకు కార్పొరేషన్ పాఠశాలల్లో ఎవరైనా ఉపాధ్యాయుడు సెలవు పెడితే సంబంధిత పాఠశాలకు వెళ్లి బోధించడానికి క్లస్టర్ టీచర్లను ఉద్దేశించారు. ఇలా కార్పొరేషన్ పాఠశాలల్లో గుర్తించిన సుమారు 90 మంది ఉపాధ్యాయులను నగరంలోని మూడు క్లస్టర్ హైస్కూళ్లలో రిజర్వ్‌లో ఉంచారు. ఈ క్రమంలోనే తాజాగా మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌లో ఏలూరు నగరపాలక సంస్థకు మరో 44 మంది కొత్త ఉపాధ్యాయులు నియమితులయ్యారు.

ఇదే పద్ధతిన ఉమ్మడి జిల్లాలోని తాడేపల్లిగూడెం, భీమవరం, నిడదవోలు, తణుకు, నరసాపురం, కొవ్వూరు, పాలకొల్లు మున్సిపల్ పాఠశాలలకు మొత్తం 148 మంది ఉపాధ్యాయులు మెగా డీఎస్సీలో నియమితులయ్యారు. ఇప్పటికే ఈ మున్సిపాల్టీల్లో సర్‌ప్లస్‌లో ఉన్న టీచర్లను కొన్ని పాఠశాలలకు సర్దుబాటు చేయగా, ఇపుడు కొత్తగా వచ్చే డీఎస్సీ ఉపాధ్యాయులను క్లస్టర్ పాఠశాలలకు కేటాయించడం మినహా మరో మార్గంలేదని విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. ఆ ప్రకారం ఏలూరు కార్పొరేషన్, 7 మున్సిపాల్టీల పాఠశాలలకు నియమితులయ్యే కొత్త టీచర్లంతా విధులు చేపట్టే తొలిరోజు నుంచే జాయినింగ్ సర్‌ప్లస్ టీచర్లుగా ఉంటారని క్షేత్రస్థాయి పరిస్థితులు సంకేతాలిస్తున్నాయి. రోజువారీ తరగతి గది బోధన విధులకు అవకాశం లేని సందర్భంలో సంబంధిత సర్‌ప్లస్ టీచర్లను ఇంతకుముందు డీఈవో పూల్‌లో ఉంచినట్టుగానే, ఇపుడు క్లస్టర్ స్కూళ్లకు పంపించి సర్దుబాటు చేయడంతోపాటు, అవసరమైనపుడు ఆయా పాఠశాలలకు ప్రత్యామ్నాయంగా పంపి సేవలను వినియోగించుకుంటారు.

### రక్తదానం చేసి.. అనారోగ్యంతో యువకుడి మృతి!

భీమవరం క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి బంధువులకు రక్తదానం చేసిన అనంతరం అనారోగ్యానికి గురైన ఒక యువకుడు మృతి చెందాడు. భీమవరం వన్ టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన నామవరపు నరేశ్(26) ఈ నెల 7వ తేదీన భీమవరం పట్టణం వచ్చి తన స్నేహితుడి బంధువులకు అనారోగ్యంగా ఉండటంతో రక్తదానం చేశాడు. అనంతరం స్పృహ తప్పి పడిపోవడంతో అతడిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. దీనిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

### రవాణా శాఖ సీజ్ చేసిన వాహనాలకు 22న వేలం


ఏలూరు క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రవాణాశాఖ అధికారులు సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 22న జంగారెడ్డిగూడెం ఆర్టీవో కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు జిల్లా ట్రాన్స్‌పోర్టు డిప్యూటీ కమిషనర్ షేక్ కరీమ్ తెలిపారు. చాలా కాలంగా పన్ను చెల్లించకుండా, ఫిట్ నెస్ లేకుండా ఇతర కారణాలతో వాహన తనిఖీల్లో అధికారులు వాహనాలు సీజ్ చేసినట్టు తెలిపారు. వాహన యజమానికి, ఫైనాన్షియర్లకు నోటీసులు జారీ చేసినప్పటికీ వారి నుంచి ఇప్పటికి స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలోనే ఆ వాహనాలను బహిరంగ వేలం వేసి వచ్చిన సొమ్ములను ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్టు డీటీసీ తెలిపారు. ఈ వేలంలో మూడు గూడ్స్ క్యారీయర్లు, ఒక మ్యాక్సీ క్యాబ్, మూడు ట్రాక్టర్లు, తొమ్మిది మోటార్ సైకిళ్లు ఉన్నట్టు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు వాహనాలకు బహిరంగ వేలం వేస్తామని పాల్గొనే అభ్యర్థులు రూ.ఐదు వేలు నగదు రూపంలో డిపాజిట్ చెల్లించాలని, ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు. వేలంలో స్క్రాప్‌గా అమ్మిన వాటికి సీబుక్ మంజూరు చేయబడదన్నారు.

### సెంటిమెంట్ పేరుతో భక్తుల నుంచి డబ్బు వసూలు

#### పోలీసులకు అప్పగించిన ఆలయ సెక్యూరిటీ

ద్వారకాతిరుమల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): భిక్షమెత్తుకుని స్వామి వారి మొక్కు తీర్చుకుంటున్నానంటూ సెంటిమెంట్‌తో భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఓ మహిళను భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. ఈమెను స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. ఏలూరుకు చెందిన ఓ మహిళ ఆలయ పరిసరాల్లో కొన్నాళ్లుగా భిక్షాటన చేస్తోంది. ఈ క్రమంలో భక్తుల నుంచి రూ.100 నుంచి రూ.500 వరకూ వసూలు చేస్తోంది. సిబ్బంది పలుమార్లు హెచ్చరించినా పద్ధతి మార్చుకోకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

### ఇంట్లోకి చొరబడిన వ్యక్తి పోలీసులకు అప్పగింత


ఇంట్లోకి చొరబడిన వ్యక్తి

ఏలూరు క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దొంగలు సంచరిస్తున్నారని అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే పోలీసులు ప్రజలను అలర్ట్ చేశారు. దీంతో నార్త్ ఇండియా వారు హిందీ మాట్లాడేవారు ఎవరైనా కనిపిస్తే ఒక్కసారి ఉలిక్కిపడుతున్నారు. ఏలూరు కట్టా సుబ్బారావు వీధిలో నివాసం ఉంటున్న మృత్యుంజయరావు ఇంట్లో ఇటీవల వివాహం జరిగింది. పెళ్లి అనంతరం కుటుంబ సభ్యులంతా ఊరు వెళ్ళగా యజమాని మృత్యుంజయరావు ఒక్కరే ఇంటి వద్ద ఉన్నారు.అయితే రాత్రి 8 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి వెనుక నుంచి ఇంట్లోకి ప్రవేశించి కర్రతో దాడికి ప్రయత్నించాడు. దీంతో ఆయన భయంతో పెద్ద పెద్ద కేకలు వేస్తూ ఇంటి చుట్టు తిరిగి తప్పించుకోగలిగారు. చివరకు ఒక క్రికెట్ బ్యాట్ కనిపించడంతో ఆ వ్యక్తి నుంచి కాపాడుకోవడానికి తలపై మోదాడు. ఈలోగా ఆయన అరుపులకు చుట్టు పక్కల వారు రావడంతో అజ్ఞాత వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తను హిందీ మాట్లాడడం, షర్టు లేకుండా ఉండడం ఆ వ్యక్తి ఎవరనేది అంతు పట్టని విషయంగా ఉంది. ఏలూరు టూటౌన్ పోలీసులు వచ్చి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి ఎవరనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.





ప్లాంటేషన్‌లో అక్రమార్కులు కొట్టేసిన జామాయిల్ చెట్లు.. వదిలేసిన దుంగలు.. జామాయిల్ ప్లాంటేషన్ వివరాలు తెలిపే శిలాఫలకం

# అడవిలో దొంగలు..

- అక్రమంగా జామాయిల్ నరికివేత
- గుట్టుగా సాగిపోతున్న విక్రయాలు
- కొరవడిన అటవీ శాఖ పర్యవేక్షణ

జీలుగుమిల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎఫ్‌డీసీ(ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)లో గుర్తు తెలియని అటవీ దొంగలు అక్రమంగా జామాయిల్ చెట్లను నరికి విక్రయిస్తున్నారు. జీలుగుమిల్లి ఏపీఎఫ్‌డీసీ జామాయిల్ ప్లాంటేషన్ పరిధిలో చెట్లు నరికివేస్తున్నారు. వర్షాకాలం కావడంతో ప్లాంటేషన్‌లో తుప్పలు పెరిగాయి. దీంతో జామాయిల్ చెట్లను అక్రమార్కులు నరికిన ఆనవాళ్లు కనిపించడం లేదు. అదే వేసవిలో అయితే ఎక్కడ చెట్టును నరికినా ఇట్టే గుర్తించడానికి అవకాశం ఉంటుంది. వర్షాకాలాన్ని ఆసరాగా చేసుకుని కలపను మరింతగా తరలిస్తున్నారు. ఏపీఎఫ్‌డీసీ 2006లో జామాయిల్ ప్లాంటేషన్ జీలుగుమిల్లి పరిధిలో 56 హెక్టార్లలో నాటారు. అక్రమార్కుల నరికివేత కారణంగా ప్లాంటేషన్ ఇప్పటికే కొంత అంతరించిపోయింది. అక్కడక్కడ ఏపుగా పెరిగి కనిపించే చెట్లను ఇటీవల పొగాకు బ్యారన్ బాదులు కొందరు అమ్ముకుంటున్నారు. రైతు వారీగా కొంత మంది పొలాల్లో జామాయిల్ సాగు చేపట్టారు. వీటి నుంచి పర్మిషన్ తెచ్చుకుని అడవిలో నరికిన చెట్లను బయట తెచ్చి విక్రయిస్తున్నారు. రాత్రి సమయంలో నరికిన జామాయిల్ బాదులు కొందరు ట్రాక్టర్లపై బయటకు తరలిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ప్లాంటేషన్ పర్యవేక్షణ నేపథ్యంలో అడవిలోకి కనీసం పశువుల కాపరులను సైతం రానివ్వడం లేదు. మేకలు, గొర్రెల కాపరులు ప్లాంటేషన్ లోపలికి వస్తే తమ అక్రమ కలప నరికివేత గుట్టు రట్టవుతుందని నిలువరిస్తున్నట్టు కొందరి వాదన. ఇలా కొందరు అక్రమ అటవీ కలపవ్యాపారానికి జామాయిల్ ప్లాంటేషన్ అడ్డాగా మారింది. ఒక్కో బాదు సుమారు రూ.1500 నుంచి రూ.1000మధ్య విక్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని బట్టి బాదుకు ధర వెచ్చించి కొనుగోలు చేస్తుంటారు. సంబంధిత అధికారులు జామాయిల్ కలప అక్రమ నరికివేతకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని సమీప గ్రామాల ప్రజలు చెబుతున్నారు. అటవీ శాఖాధికారులు తక్షణ చర్యలు చేపట్టి కలప అక్రమంగా తరలిపోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



నిందితులను మీడియాకు చూపుతున్న పోలీసులు.. స్వాధీనం చేసుకున్న బంగారపు నగలు

# ఎస్.ఇల్లింద్రపర్రు చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- అత్తాకోడళ్లను బంధించి చోరీ
- 40 కాసుల బంగారం స్వాధీనం

పెనుమంట్ర, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సినీ ఫక్కీలో ఇంట్లోకి ప్రవేశించి అత్తాకోడళ్లను తాళ్లు, చీరతో కాళ్లు చేతులు బంధించి, చంపుతామని బెదిరించి చోరీకి పాల్పడిన ముఠా సభ్యులు ఎట్టకేలకు పోలీసుల వలకు చిక్కారు. పెనుగొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిందితులను, దోపిడీ చేసిన బంగారు ఆభరణాలను స్వాధీనపరుచుకున్నారు. సీఐ రాయుడు తెలిపిన వివరాల ప్రకారం పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లింద్రపర్రులో ఈ నెల 16వ తేదీ రాత్రి 7:45 సమయంలో ఇంట్లోకి ప్రవేశించి, కత్తి చూపించి చంపేస్తామని బెదిరించి, నగదు, బంగారు నగలు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నర్సాపురం డీఎస్పీ శ్రీవేద ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేసి గాలించి ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40.5 కాసుల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం పెనుమంట్ర మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో నత్తారామేశ్వరం ముఖద్వారం వద్ద నిందితులు వెలగల నరేంద్రరెడ్డి, తెరవాడ హనుమంతరావు, చింతల సుధాకర్ ఉన్నట్టు తెలుసుకుని బృందంతో వెళ్లి అరెస్ట్ చేశామన్నారు. సీఐతో పాటు ఆచంట ఎస్.ఐ. కె.వి.రమణ, పెనుమంట్ర ఎస్.ఐ. కె.స్వామి, ఏఎస్ఐ అంజిబాబు, నరసాపురం సైబర్ టీం సుబ్రహ్మణ్యం, జిల్లా సైబర్ టీం భాస్కరరావులు కేసు దర్యాప్తులో పాల్గొన్నారు.

### ఇడా వైస్ చైర్మన్‌గా ఇన్‌చార్జి జేసీ విశ్వేశ్వరరావు



ఏలూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఇడా) వైస్ చైర్మన్‌గా ఇన్‌చార్జి జేసీగా ఉన్న జిల్లా రెవెన్యూ అధికారి వల్లూరు విశ్వేశ్వరరావును నియమిస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జేసీ పి.ధాత్రిరెడ్డి రతన్ టాటా ఆర్‌టీహెచ్ సీఈవోగా బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి జేసీగా ఉన్న విశ్వేశ్వరరావు ఇడా వైస్ చైర్మన్‌గా ఆమె స్థానంలోనే ఇప్పుడు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

# సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు డ్రైవింగ్

- వారించిన ప్రయాణికులపై చిందులు
- చివరకు విధుల నుంచి తొలగింపు



ఏలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని ప్రశ్నించిన ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తించిన డ్రైవర్ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ సృష్టించింది. ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం పల్లె వెలుగు బస్సును మంగళవారం డ్రైవర్ సాయికుమార్ సెల్ మాట్లాడుతూ నడిపాడు. ఇది గమనించిన ప్రయాణికులు ప్రమాదకరమని వారించగా తిరిగి వారిపై విరుచుకుపడ్డాడు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో స్వయంగా చూసిన డీపీటీవో షేక్ షబ్నం ఆ డ్రైవర్‌ను విధుల నుంచి తప్పించినట్లు తాజాగా ప్రకటించారు.

### విద్యార్థికి విద్యుదాఘాతం

దెందులూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జీఎస్టీపై అవగాహన కార్యక్రమంలో మైక్‌తో మాట్లాడుతుండగా గోపన్నపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థి కార్తీక్‌కు మంగళవారం విద్యుత్ షాక్ తగిలింది. విషయం తెలుసుకున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీవైఈవో రవీంద్ర భారతి ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి వెళ్లి కార్తీక్‌ను పరామర్శించారు. బుధవారం ఎంఈవో ప్రసాద్‌తో కలిసి కరెంట్ షాక్‌పై విచారణ చేపట్టారు.

● **ఘనంగా అన్నదానం**

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : బావిశెట్టివారిపేట దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని కనకదుర్గాంబ అమ్మవారి ఆలయం వద్ద దేవీనవ రాత్రులు ముగిసిన సందర్భంగా బుధవారం అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి ప్రారంభించారు.



### మందులు, జీవిత భీమాపై జీఎస్టీ సంస్కరణల ప్రచారం చేయండి

ఏలూరు,అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఔషధాలు, జీవిత, ఆరోగ్య బీమాలపై జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు.కలెక్టరేట్ నుంచి బుధవారం సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై మూడో వారం కార్యక్రమాల నిర్వహణపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్షించారు.దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు వినియోగించే ఔషధాలతో పాటు కొన్ని ప్రధాన ఔషధాలు, జీవిత, ఆరోగ్య బీమాలపై జీఎస్టీ పూర్తిగా తొలగించిన విషయంపై సామాన్యులకు వివరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## రేపటి నుంచి పింఛన్ల అర్హత పునఃపరిశీలన

ఏలూరు క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో విభిన్న ప్రతిభావంతుల పింఛన్ల పునఃపరిశీలన ఈ నెల 10వ తేదీ నుంచి జరుగుతుందని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయరాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకంలో అనర్హులకు నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. అందులో 3024 మంది అప్పీలు చేసుకోగా వీరందరికీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా పింఛన్లు పునరుద్ధరణ పరిశీలన జరుగుతుందన్నారు. వీరికి జిల్లాలోని ఏలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, జంగారెడ్డిగూడెం, నూజివీడు ఏరియా ఆసుపత్రుల్లో పింఛన్ పునఃపరిశీలన శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని, అలాగే ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో పరిశీలన ఉంటుందన్నారు. అప్పీలు చేసుకున్న 3024 మందిలో ఎవరైతే నోటీసులు అందుకున్నారో వారంతా జిల్లాలోని మూడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పున:పరిశీలనకు హాజరు కావాల్సిందిగా సచివాలయ సిబ్బంది ఇప్పటికే తెలియజేసినట్టు పేర్కొన్నారు.

## ఏజెన్సీ చట్టాలను అమలు చేయడం లేదని ఫిర్యాదు

బుట్టాయగూడెం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ చట్టాలను అమలు చేయని అధికారులపైన చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబరు జాటోతు హుస్సేన్ నాయక్‌ను కోరగా సానుకూలంగా స్పందించారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కుంజా శ్రీను తెలిపారు. కెఆర్ పురం ఐటీడీఏకు వచ్చిన మెంబరును కలిసి రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాలను, అధికారుల పనితీరును ఆయనకు వివరించామన్నారు. ఎల్టీఆర్, 1/70 చట్టం, అక్రమ కట్టడాలు, మైనింగ్ మాఫియా, బ్లాక్ మెటల్ క్వారీ తదితర విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరగా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని శ్రీను తెలిపారు.

## దుకాణాలు తొలగించి.. ఆటో పార్కింగ్ స్థలం చూపండి

కుక్కునూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కుక్కునూరులో రోడ్డును ఆక్రమించి నిర్మించిన దుకాణాలు తొలగించి ఆటోలకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.సాయికిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం అల్లూరి సీతారామరాజు ఆటోడ్రైవర్ల యూనియన్ సమావేశం జరిగింది. మండలంలో వంద మందికి పైగా ఆటోడ్రైవర్లు ఉండగా వారి కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. కనీసం మండల కేంద్రంలో ఆటోలకు పార్కింగ్ పాయింట్ లేదన్నారు. ఆర్అండ్‌బీ అధికారుల అనుమతి లేకుండా ప్రధాన రహదారిని ఆక్రమించి నిర్మించిన దుకాణాలు తొలగిస్తే ఆటోడ్రైవర్లు వాహనాలను పార్కింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈసమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదన్నారు. పోచారపు వెంకటేశ్వర్లు, రమేశ్, కృష్ణ, రాము, మహేశ్, మనోజ్ పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై జిల్లా స్థాయి శిక్షణ

ఏలూరుసిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఏలూరు వ్యవసాయ కార్యాలయంలోని ఐఏడీపీ హాల్లో బుధవారం జిల్లా స్థాయి ప్రకృతి వ్యవసాయ శిక్షణ, డీబ్రీఫింగ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా మాట్లాడుతూ ప్రతి క్యాడర్ కనీసం ఇద్దరు లేదా ముగ్గురు రైతులను ప్రకృతి వ్యవసాయ విధానంలోకి తీసుకురావాలన్నారు. అమినో ఆమ్లాలు ప్రొటీన్ నిర్మాణానికి పునాదిరాళ్ళుగా పనిచేస్తాయని, ప్రకృతి వ్యవసాయం ఒక బ్రాండ్ అని ఇందులో నాణ్యతకే ప్రాధాన్యం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా డీపీఎం వెంకటేశ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండే పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. మార్కెటింగ్ వ్యవస్థ, బయో రిసోర్స్ సెంటర్ కార్యకలాపాలు, ఈ-క్రాప్ వివరాలు, ఆర్డీఎస్ కార్యాచరణ ప్రణాళిక, పీఎండీఎస్ అమలు విధానాలపై చర్చించారు.

## రాష్ట్ర క్రీడా జట్లకు సెయింట్ థెరిస్సా విద్యార్థినుల ఎంపిక

ఏలూరు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల అండర్-19 బాలికలకు ఈ నెల 7న తణుకు ఎస్కేఎస్డీ మహిళా కళాశాలలో నిర్వహించిన వివిధ క్రీడా ఎంపికల్లో ఏలూరు సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగల్, ఫిజికల్ డైరెక్టర్ ఆండాళ్లు తెలిపారు. చెస్ జట్టుకు ఎం.భవ్యశ్రీ, త్రోబాల్ జి.సాత్విక, వి.అక్షయ, వాలీబాల్ కె.మీనామృత సత్య, సీహెచ్.కామాక్షి, సీహెచ్.నందిని, ఖోఖో కె.కీర్తన, కె.దివ్య, కబడ్డీ జి.మోహన విజయదుర్గ, టి.యోగిత, సీహెచ్.అనురాధ, బాల్‌బ్యాడ్మింటన్ డి.భాగ్య మరియ, ఎస్.సత్యశ్రీ, పి.అన్నపూర్ణ రాష్ట్ర జట్లకు ఎంపికయ్యారని వివరించారు.

## సమ్మెకు ఏపీవీవీపీ, సీహెచ్‌సీ వైద్యుల మద్దతు

ఏలూరు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో ఇన్ సర్వీస్ కోటాను 30 శాతానికి పెంచి ఐదేళ్ల పాటు కొనసాగించాలన్న ప్రధాన డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో కొన్ని రోజులుగా జరుగుతున్న సమ్మెను కొనసాగించాలని నిర్ణయించినట్టు పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గంగాభవాని, డాక్టర్ జోషిమా తెలిపారు. తమ సమ్మెకు మద్దతు ప్రకటిస్తూ ఏపీ వైద్య విధాన పరిషత్(ఏపీవీవీపీ), కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల(సీహెచ్‌సీ)లో ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు కూడా బుధవారం నిరాహార దీక్షల్లో పాల్గొన్నారని తెలిపారు. డిమాండ్లపై ప్రభుత్వంతో సంఘ రాష్ట్ర నాయకులు చర్చలు కొనసాగిస్తారని వివరించారు.

## 11 రోడ్లు.. రూ.30.18 కోట్లు

(5వ పేజీ తరువాయి)


నుంచి కోరుకల్లు ఐదు కి.మీలకు రూ.4.30 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కాగా కృష్ణా జిల్లా నుంచి ఏలూరు జిల్లాలో కలిసిన రెండు రోడ్లకు ఈసారి ప్రాధాన్యం ఇవ్వడం విశేషం. జంక్షన్ సమీపంలోని నూజివీడు- వయా కల్లూరు రోడ్డు, కైకలూరు నియోజక వర్గంలో లోపూడి కొత్తగూడెం రోడ్లకు మోక్షం కలగనుంది.

## బాణసంచా..చీకట్లు

(5వ పేజీ తరువాయి)

పెడుతున్నారు. అధికారులు తూతూ మంత్రంగానే తనిఖీలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. దీపావళి పండుగకు తాత్కాలిక షాపుల అనుమతులు కోసం ఇప్పటి వరకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, కైకలూరు మండల ప్రధాన కేంద్రాల్లో ఏర్పాటు చేసుకోవడానికి 24 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే జనవాసాల మధ్య వీటికి అనుమతులు ఉండవంటూ స్పష్టం చేస్తున్నారు. అనధికారిక విక్రయాలపై చర్యలు తీసుకుంటామని పోలీసులు, ఫైర్, రెవెన్యూశాఖ అధికారులు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

**అన్ని జాగ్రత్తలు సూచిస్తున్నాం : టి.శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ అధికారి**



గత ఘటనల దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బాణసంచా విక్రయ, నిల్వ దారులకు సూచిస్తున్నాం. ఇప్పటికే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి దీపావళి షాపు ఏర్పాటుకు తాత్కాలిక అనుమతి ఇస్తున్నారు. దీపావళి రోజు సాయంత్రం 5 గంటలకు షాపులన్నీ మూసివేయాలి. ఎక్కువ షాపులున్న ప్రాంతంలో అగ్నిమాపక వాహనాన్ని అక్కడ ఏర్పాటు చేస్తున్నాం. మిగిలిన ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బందిని ఫైర్ ఎగ్జిట్ మిషన్లతో డ్యూటీలు వేస్తున్నాం.

**ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు : కలెక్టర్**

'బాణసంచా ప్రమాదాలు సంభవించకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. పోలీసు, రెవెన్యూ, ఫైర్, తదితర శాఖల అధికారులతో తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి బాణసంచా అనధికార, తయారీ నిల్వ, అమ్మకం, భద్రతా చర్యలపై ప్రత్యేక నిఘా పెట్టాలి' అని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లాలో బాణసంచా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, బాణసంచా అనధికార తయారీ నిల్వలు, అమ్మకాల నియంత్రణపై బుధవారం అధికారులతో టెలీకాన్ఫరెన్సులో ఎస్పీ కె.ప్రతాప శివ కిశోర్‌లతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టీసీ, ప్రైవేట్ రవాణా వాహనాలను చెక్ పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించాలని, అనధికారికంగా బాణసంచా రవాణా చేసే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ గతంలో ఊరు శివారు ప్రాంతంలో బాణసంచా తయారీకి అనుమతులు ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో నివాసిత గృహాలు వచ్చి ఉంటాయని, అటువంటి తయారీ కేంద్రాలను అక్కడ నుంచి తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలు వేర్వేరు చోట్ల ఉండాలన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం పాల్గొన్నారు.

## మూణ్ణాళ్ల ముచ్చట!

(5వ పేజీ తరువాయి)

అడుగు పెట్టగానే జారి పడ్డాడు. వైసీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి అప్పట్లో సచివాలయాల పనులు చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే తూతూ మంత్రంగా ఫ్లోరింగ్‌కు మెరుగులు దిద్ది సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రజాప్రతి నిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఫ్లోరింగ్ పనులు మళ్లీ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# ప్రయాణికుల సహనానికి ఆర్టీసీ పరీక్ష

**తరచూ తలెత్తుతున్న సాంకేతిక సమస్య**

**కాలం చెల్లిన బస్సులే కారణమని ఆరోపణలు**




బుట్టాయగూడెం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సాంకేతిక సమస్యల కారణంగా ఆర్టీసీ బస్సులు తరచూ మార్గమధ్యలో నిలిచిపోతూ ప్రయాణికుల సహనానికి అగ్నిపరీక్ష పెడుతున్నాయి. సమయానికి గమ్యానికి చేరుదామని బస్సు ఎక్కిన ప్రయాణికులు మార్గమధ్యలో ఆగిపోయిన బస్సును చూసి లబోదిబోమంటున్నారు. కాలం చెల్లిన బస్సులను నడపడం వల్లే ఇలాంటి దుస్థితి ఏర్పడుతోందని వాపోతున్నారు. బుధవారం మర్లగూడెంలో ఇటువంటి ఘటనే ప్రయాణికులకు ఎదురైంది. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన బస్సు రెడ్డిగణపవరం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్తూ సాంకేతిక సమస్యతో మార్గమధ్యలో మర్లగూడెంలో ఆగిపోయింది. బస్సు ఊర్లో ఆగిపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అదే అడవిలో ఆగిపోతే పిల్లలతో ఉన్న తల్లులు, ఇతరుల పరిస్థితి ఏమిటని గగ్గోలు పెట్టారు. గేర్‌రాడ్ ఊడి రావడంతో ప్రయాణికులకు ప్రమాదం జరగకుండా బస్సును నిలిపివేసినట్టు డ్రైవర్ తెలిపారు. తరచూ చెడిపోతున్న బస్సుల్లో ఉచిత ప్రయాణాలు చేస్తూ ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మెకానిక్‌లు వచ్చి బస్సును బాగుచేయడమా లేక మరో బస్సును పంపడమా జరిగే వరకు గంటల తరబడి ప్రయాణికులు అగచాట్లు పడుతున్నారు. అనుకున్న సమయాలకు గమ్యాన్ని చేరడం గగనంగా మారిందని వాపోతున్నారు. కండిషన్‌లో ఉన్న బస్సులను ఏజెన్సీలో నడపాలని కోరుతున్నారు.



శనివారపుపేటలో పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన కె.కోట విద్యార్థులు



పెదవేగిలో ప్రారంభిస్తున్న ఎంఈవోలు

# క్రీడా ఉత్సవం

**రాష్ట్ర స్థాయికి క్రీడాకారుల ఎంపికలు - వేడుకగా జరిగిన పోటీలు - ఆర్థిక భారంతో సతమతం**

ఏలూరు రూరల్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే బాలబాలికలు క్రీడలపై దృష్టి సారించేందుకు వీలుగా ఏటా ఎస్‌జీఎఫ్ ఎస్‌ఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాదికి సంబంధించి మండల స్థాయిలో పోటీలు బుధవారం శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ పంకజ్ కుమార్, ఏడీ-2 వెంకటప్పయ్య, పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్ లాంఛనంగా ప్రారంభించారు. ఎంఈవో-2 అరుణ్ కుమార్, మాజీ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు, డివిజన్ ఇన్‌చార్జి చేకూరి గణేశ్, ఎస్ఎంసీ చైర్మన్ జలీల్ కౌశల్, పోటీలకు మండలంలో అన్ని పాఠశాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మండల స్థాయిలో పోటీల నిర్వహణకు రూ.లక్షల వరకు ఖర్చు అవుతోందని పీఈటీలు చెబుతున్నారు.గ్రామాభివృద్ధి కమిటీ, దాతలు, యువజన సంఘాల సహకారంతో నిర్వహిస్తుంటారు. మండలాల్లో ఇప్పుడు దాతలు ముందుకు రావడం లేదు. దీంతో ఆర్థిక సమస్య తలెత్తుతోందని, ప్రభుత్వం కొంతమేరకే సహకారం అందుతోందని పీఈటీలు పేర్కొంటున్నారు.

● పెదపాడు: పెదపాడు మండలం వట్లూరు హైస్కూల్లో మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో భాగంగా క్రీడాకారుల ఎంపిక పోటీలు బుధవారం జరిగాయి. ఎంఈవో నరసింహమూర్తి ఈ పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లోనూ విద్యార్థులు ప్రతిభ చూపాలన్నారు. ముళ్ళపూడి సాంబశివరావు, ఎంఈవో-2 జంగం రవీంద్ర, హెచ్.ఎం. ఆదిలక్ష్మి, పీడీల మండల కన్వీనర్ మల్లిశ్వరి పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండలంలోని ఆడమిల్లి జడ్పీ పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఘంటా రవిచంద్రమోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు మానుకొండ సుబ్బారావులు తెలిపారు. ఈ నెల 6న ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన ఎస్‌జీఎఫ్ డిస్ట్రిక్ట్ హ్యాండ్ బాల్ ఎంపికలో ఆడమిల్లి పాఠశాలకు చెందిన అండర్-14, అండర్-17 విభాగాల్లో విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ అండర్-14 విభాగానికి కె.పూజిత, బి.అక్షర, ఎస్.కె.అవతుల్ మాలిక్, పి.భూమిక ధనశ్రీ, బి.అక్షయ, పి.కుమారి, హ్యాండ్ బాల్ అండర్-17 విభాగంలో ఎం.చరణ్‌చంద్, అండర్-19 ఇయర్స్ సాఫ్ట్ బాల్ విభాగంలో పి.ఉష, బి.అంకిత, కె.అఖిల్, అండర్-19 బేస్‌బాల్ విభాగంలో బి.కార్తీక్, బి.పావని, పి.లక్ష్మీప్రసన్నలు ఎంపికయ్యారని, త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం రవిచంద్రమోహన్, పీడీ సుబ్బారావులు తెలియజేశారు.

● లింగపాలెం:మండలంలోని సింగగూడెం ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీల ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీలను మండల విద్యాశాఖ అధికారి కె.రామారావు ప్రారంభించారు. ఈ పోటీలకు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల కోఆర్డినేటర్ సి.హెచ్.ప్రభాకర్‌రావు, పీడీ శ్యామల, పద్మ, లక్ష్మి, ప్రభాకర్, ఆర్గనైజర్ కామేశ్ పాల్గొన్నారు.

● పెదవేగి: స్కూల్ గేమ్స్ 14, 17 ఏళ్ల విభాగం మండల స్థాయి జట్ల ఎంపిక పోటీలు పెదవేగి మండలం విజయరాయి జడ్పీ ఉన్నతపాఠశాలలో బుధవారం జరిగాయి. మండలం నుంచి 450 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని, ప్రతిభతో మండలస్థాయి జట్లకు ఎంపికయ్యారు. ఎంఈవోలు బి.త్రిపురసుందరిదేవి, అరుణ్ కుమార్‌లతో కలిసి జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని ఎం.వెంకటరమణ ఈ పోటీలను ప్రారంభించారు. ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.అలివేలు, ఏలూరు డివిజన్ కార్యదర్శి కె.రాజగోపాల్, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, పీడీలు మల్లికార్జున్, నరసింహరాజా, ఇతర పీడీలు పాల్గొన్నారు.

● దెందులూరు: మండల స్థాయి క్రీడాపోటీల ఎంపికలను కొవ్వలి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. విద్య కమిటీ చైర్మన్ బీద గణేశ్ కుమార్, సర్పంచ్ సుమలతలు ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది పాల్గొనగా అండర్ 14,అండర్ 17 విభాగాల్లో బాల,బాలికల విభాగాల్లో కోకో, కబడ్డీ, చెస్, యోగా, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం శర్మ, టీడీపీ నాయకులు కసుకుర్తి రామకృష్ణ పాల్గొన్నారు









లింగపాలెం, పెదపాడు, చింతలపూడి మండలాల్లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

# నేరాల నియంత్రణపై అవగాహన

లింగపాలెం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేరాల నియంత్రణకు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నామని సీఐ క్రాంతి కుమార్ అన్నారు. మండంలోని మఠంగూడెం శివారు సుందర్రావుపేట గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అసాంఘీక శక్తులకు సహకరించకూడదన్నారు. అనంతరం తెల్లవారు జామున ఫేస్‌వాష్ కార్యక్రమంలో బాగంగా వాహన తనిఖీలు చేపట్టారు. ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, పోక్సో చట్టాలపై కళాశాల ఈగల్ క్లబ్, పట్టణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. యువత చెడు వ్యవసనాలకు బానిసలై నేరాలకు పాల్పడుతున్నారని, అందుకే అప్రమత్తంగా ఉండాలని చింతలపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.క్రాంతికుమార్ సూచనలిచ్చారు. వీటిపై అవగాహన పెంచుకుని పక్కవారికి తెలియచేయాలన్నారు. సదస్సులో ఎస్ఐ సతీశ్ కుమార్, ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు, ఈగల్ క్లబ్ సమన్వయ కర్తలు ఎ.వెంకటేశ్వరరావు, లెఫ్టినెంట్ జి.జె.మౌనిక, వైస్ ప్రిన్సిపల్ ఎన్.జె.కె.నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

### విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకోవాలి

పెదపాడు: విద్యార్థులు చట్టాల గురించి తెలుసుకోవాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ కుటుంబ సభ్యులను అప్రమత్తం చేయాలని పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్, నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్ ఆదేశాల మేరకు పెదపాడు హైస్కూల్ విద్యార్థులకు చట్టాలు, సైబర్ నేరాల పట్ల బుధవారం అవగాహన కల్పించారు. ఎస్.ఐ. సతీశ్ మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆపద సమయంలో 112కు సమాచారం అందించాలని, 10 నిమిషాల వ్యవధిలో పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారన్నారు. అసాంఘిక కార్యకలాపాల గురించి 83329 59175, 95503 51100కి తెలియజేయాలన్నారు.పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న లారీ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ

## మాకు ఇసుక ఎందుకివ్వరు?

**అధికారులకు లారీ అసోసియేషన్ ఫిర్యాదు**

చింతలపూడి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇసుక రీచ్‌లలో తమకు ఇసుక ఇవ్వడం లేదని చింతలపూడిలోని ఆంజనేయ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండల రెవెన్యూ అధికారులకు మెమోరాండం అందించారు. ప్రస్తుతం జరుగుతున్న ఇసుక దందాను అందులో ప్రస్తావిస్తూ తెలంగాణకు తెల్లవారు జామున, రాత్రివేళ తరలుతున్న లారీల నెంబర్ల వివరాలతో ఫిర్యాదు చేశారు. చెక్‌పోస్టులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా ఫలితం లేదని, అక్కడ చేతివాటాలు ఉన్నట్టు పేర్కొన్నారు. తమకు ఇవ్వడం లేదని, తెలంగాణకు ఏ విధంగా ఇస్తున్నారని ప్రశ్నించారు. రాజమహేంద్రవరం కిరాయికి వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు కిరాయి ఉండడం లేదని, ఈ క్రమంలో కుమారదేవరం రీచ్ నుంచి ఇసుక లోడింగ్‌కు వెళితే మీ లారీలకు ఇచ్చేదిలేదని చెబుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో వైపు రోజుకు 10 నుంచి 15 లారీలు తెలంగాణకు ఇసుకను తరలిస్తున్నాయన్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని అసోసియేషన్ డిమాండ్ చేస్తోంది.

## న్యాయమూర్తిపై దాడికి నిరసన

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వి.ఆర్.గవాయ్‌పై జరిగిన దాడిని సీపీఎం నాయకులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, పంపన రవికుమార్‌లు ఖండించారు.దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిషోర్‌ను, ఉసిగొల్పిన మతోన్మాద శక్తులను చట్టబద్ధంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గవాయ్‌పై జరిగిన దాడికి ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రసాద్ మాట్లాడుతూ దాడి పట్ల నిరసన తెలిపారు. మతోన్మాదం నశించాలని లౌకికవాదం వర్ధిల్లాలని పేర్కొన్నారు. జైభారత్ పార్టీ నాయకులు పాము రవీంద్రనాథ్, రాంబాబు, దేవరపల్లి రత్నబాబు, కనకరాజు నిరసనలో పాల్గొన్నారు. సీపీఎం నాయకులు జి.వి.ఎల్.నరసింహారావు, అరుణతార నాగేశ్వరరావు, ఎం.శ్యామలరాణి, లెనిన్, ఎం.ఇస్సాకు, జె.గోపి, మావూరి శ్రీనివాస్, కాకర్ల రాజేంద్రప్రసాద్, కొప్పాడ నరసింహమూర్తి, అమరకుమార్, జి.కోటేశ్వరరావు, బి.శేఖర్ పాల్గొన్నారు.

## జాతరను విజయవంతం చేయండి

ఏలూరు టూటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పవర్‌పేటలో ఉన్న శ్రీగంగానమ్మ, శ్రీఆదిమహాలక్ష్మమ్మ, శ్రీవినుకొండ అంకమ్మ, పోతురాజుల జాతర మహోత్సవం విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చంటి సూచించారు. ఏఎంసీ చైర్మన్ పార్థసారథి కార్యాలయంలో జాతర బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నవంబరు 9న అమ్మవార్లకు ముడుపులు కట్టి, పందిరాట స్థాపనకు శ్రీకారం చుడతారని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

## ప్రజలకు సురక్షితమైన తాగునీరందిస్తాం

పెదపాడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సురక్షిత నీటిని అందించేందుకు కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. కొత్తూరు గ్రామంలో జేఎంజే గ్రాంట్ రూ.26.20 లక్షలతో చేపట్టిన మంచినీటి పైపులైన్ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

టి.నర్సాపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తుందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. బొర్రంపాలెం నుంచి రాధికంపాడు వరకు రూ.41.22 కోట్లు అంచనాతో నిర్మించనున్న ఆర్అండ్‌బీ రోడ్డుకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు మెరుగుపడితే ప్రజల జీవన విధానం మెరుగవుతుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీరామమూర్తులు, జనసేన మండలాధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.



రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోషన్

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే రోషన్ కుమార్ పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటి నలభై లక్షలతో నిర్మించబోయే శ్రీనివాసపురం బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరయ్యారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు టూటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ 15 నెలలుగా ప్రజాదర్బర్ నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో కూడా ఎవరైన సమస్యలుంటే తనదగ్గరికి నేరుగా వచ్చి తెలియజేయవచ్చని ప్రజలకు సూచించారు.

## ఆర్ఓబీ సమస్యలు పరిష్కరిస్తాం

ఏలూరు టూటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఓబీల సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.వట్లూరు రైల్వే అండర్ బ్రిడ్జికి త్వరలో అనుమతి లభించనుందన్నారు. పూళ్ల, కైకరం, పి.కన్నాపురం, రైల్వే గేట్ల పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఆర్‌వోబీ పనుల పై రైల్వే, నేషనల్ హైవే అథారిటీ, రెవెన్యూ అధికారులతో చర్చలు జరుపుతున్నామని, సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.

**ఆర్‌వోబీ నిర్మాణ స్థలాల పరిశీలన..**

భీమడోలు: రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వేగవంతంగా జరిగేలా కృషి చేస్తామని ఏలూరు ఆర్డీవో అంబరీష్ అన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని పూళ్ల, కోడూరుపాడు, కైకరం ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణానికి ఎంపిక చేసిన ప్రాంతాలను అధికారుల బృందం బుధవారం పరిశీలించింది.ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు తమ అభిప్రాయాలను అధికారుల ముందు వ్యక్తం చేశారు. పూళ్ల సమీపంలోని పి.కన్నాపురం వద్ద ఉన్న రైల్వే క్రాసింగ్ వద్ద మరో బ్రిడ్జి మంజూరు చేయాలని ఇటీవల గ్రామస్తులు ఎంపీ పుట్టా మహేశ్ దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో ఈ ప్రాంత రైతులు, గ్రామస్థుల అభిప్రాయాలను అధికారులు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో భీమడోలు ఆర్‌వోబీపై చర్చించారు.

## విజయ్ నాయక్‌కు అభినందనలు

పోలవరం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా టీడీపీ నేత భుక్యే విజయ్ నాయక్ ఎంపిక పట్ల బుధవారం పోలవరం నియోజకవర్గ నేతలు హర్షం వ్యక్తం చేశారు. శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి మాట్లాడుతూ విశాఖపట్నంలో టీడీపీ రాష్ట్ర ఎస్టీ విభాగం నాయకులు విజయ్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## దీపావళిని ప్రశాంతంగా జరుపుకోండి

చింతలపూడి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, బాణసంచా తయారు చేసే, విక్రయించే దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలని సీఐ క్రాంతికుమార్ తెలిపారు. చింతలపూడి సర్కిల్ పరిధిలో అనుమతి లేకుండా ఇళ్ళల్లో, దుకాణాల్లో, సముదాయాలు, గొడౌన్లలో నిల్వలు చేయవద్దన్నారు. లైసెన్సు లేకుండా విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అంతర్ జిల్లా బదిలీలకు డిమాండ్

ఏలూరు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జడ్పీ యాజమాన్య టీచర్ల మాదిరిగానే ఏలూరు నగరపాలక సంస్థ హైస్కూళ్లలో పనిచేస్తున్న లాంగ్వేజి పండిట్లకు కూడా అంతర్ జిల్లా, మ్యూచువల్ కేటగిరీల్లో బదిలీలకు అవకాశమివ్వాలని బుధవారం జరిగిన ఏపీటీఎఫ్ ఏలూరు నగర శాఖ సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. సంఘ నాయకులు రామారావు, శ్రీనివాసరావు, రత్నకుమార్, బెనర్జీ పాల్గొన్నారు.

## జీఎస్టీపై విద్యార్థులకు వక్తృత్వ పోటీ

ఏలూరు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అంశంపై బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీ నిర్వహించారు. ఎస్.కె.అబ్దుల్ మతీన్, టి.సౌజన్య, టి.సాయి పద్మజ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు నగదు బహుమతులను జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఎం.సునీత అందజేశారు. ప్రిన్సిపాల్ గిరిబాబు, జీఎస్టీ అధికారులు కిరణ్ కుమార్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## కార్మికులు సీఐటీయూలో చేరిక

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికై సీఐటీయూ కృషి చేస్తోందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో పలువురు మునిసిపల్ వర్కర్స్ యూనియన్‌లోని నాయకులు ఉమామహేశ్వరరావు సమక్షంలో సీఐటీయూలో చేరారు. వారిని సాదరంగా యూనియన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఐటీయూలో చేరిన వారిలో ఎ.జాన్‌బాబు, కాళిదాసు, ఎం.సామ్రాజ్యం, ఎ.రామకృష్ణ, నరసింహ, యడ్ల గంగరాజు, యడ్ల ఏకోబు, భట్టు రవి, గంగాధరరావు, చిట్టియ్యలు ఉన్నారు.

## గంగానమ్మ సన్నిధిలో చింతమనేని

దెందులూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజలందరిని చల్లగా చూడాలని కొవ్వలి గ్రామ దేవత గంగానమ్మను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోరుకున్నారు. బుధవారం కొవ్వలిలో గంగానమ్మ 4వ వార్షికోత్సవం సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ గ్రామాధ్యక్షుడు బగాతి చిన్నారావు, బ్యాంక్ అధ్యక్షులు వెలమాటి అనిల్ కుమార్, గోదావరి డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు, కసుకుర్తి రామకృష్ణ ఉన్నారు.

## ప్రత్యేక రైళ్ల గడువు పొడిగింపు

ఏలూరు క్రైం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా రెండు ప్రత్యేక రైళ్లను మరికొద్ది రోజులు నడపనున్నట్టు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి అనకాపల్లి మధ్య రైల్(07035)ప్రతి శనివారం ఈ నెల 11 నుంచి నవంబరు 29 వరకు నడుస్తుందన్నారు. అనకాపల్లి నుంచి హైదరాబాద్ రైల్(07036) ప్రతి ఆదివారం ఈ నెల 12 నుంచి నవంబరు 30వ తేదీ వరకు నడపనున్నట్లు తెలిపారు. ఈ రైళ్లు సికింద్రాబాద్, చర్లపల్లి, జనగామ్, ఖాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయన్నపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్లల్లో సెకండ్ క్లాస్, త్రిటైర్ ఏసీలు, స్లీపర్, సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయి.

## రేపు ఉపాధి పనులపై ప్రజావేదిక

ముదినేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 32 పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు నిర్వహించిన ఉపాధి పనులపై అభిప్రాయ సేకరణకు ఈ నెల 10న మండల స్థాయి ప్రజావేదికను నిర్వహించనున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగే ఈ ప్రజావేదికలో మండలంలో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో నిర్వహించిన 996 ఉపాధి పనులపై చర్చిస్తారు. మండలంలో గత నెల 22 నుంచి గ్రామస్థాయిలో చేపట్టిన సామాజిక తనిఖీల నివేదికలపై కూడా చర్చిస్తామని ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు.



## రీ సర్వే తనిఖీ

ముసునూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు అనుగుణంగా రీ సర్వే చేయాలని తహసీల్దార్ దాసరి ప్రశాంతి అన్నారు. చిల్లబోయినపల్లిలో రీ సర్వేను ఆమె బుధవారం తనిఖీ చేసి మాట్లాడుతూ రైతులకు ముందుగానే సమాచారం ఇచ్చామని, సర్వేకు అందుబాటులో ఉండాలన్నారు. సర్వే పూర్తయిన తరువాత భూముల సరిహద్దులు నిర్ధారించి రాళ్ళు వేయడం జరుగుతుందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ జి.పురుషోత్తమ శర్మ, వీఆర్వో పాల్గొన్నారు.

## ఘనంగా అడవి బాపిరాజు జయంతి వేడుకలు


బాపిరాజు చిత్రపటం వద్ద నివాళులు

కలిదిండి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రచయి త, కళాకారుడు అడవి బాపిరాజు జయంతిని పురస్కరించుకుని కలి దిండి శాఖా గ్రంథాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు మాట్లాడుతూ అడవి బాపిరాజు గొప్ప సాహితీవేత్త అని కొనియాడారు. విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత

## జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

కైకలూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి అంతర విశ్వ విద్యాలయ ఫెన్సింగ్ పోటీలకు కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళా శాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వై శ్రీలత తెలిపారు. ఈ నెల 7న కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల ఫెన్సింగ్ పోటీలు మైలవరంలోని డాక్టర్ లక్కిరెడ్డి హనుమారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగాయి. ఈ పోటీల్లో కళాశాలకు చెందిన బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థినులు కె. శారన్‌రోజా, పి. మీనాక్షి, పి. విన్నీ ప్రథమ స్థానాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబరు 2న పంజాబ్‌లోని గురునానక్‌దేవ్ వర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. వ్యాయామ అధ్యాపకుడు ఎం. శివనాగరాజును, విద్యార్థినులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడపా కేదారి, ఐక్యూ కో-ఆర్డినేటర్ ఆర్. జాలబాబు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



నూజివీడు టౌన్, అక్టోబరు 8(ఆంధ్ర జ్యోతి): నూజివీడు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ జరి గింది. లయన్స్ క్లబ్ నూజివీడు గ్రేటర్ ఆధ్వ ర్యంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు చేశారు. కంటి లోపాలున్న 78 మందిని గుర్తించి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె. రాజు మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, విటమిన్-ఎ ఉన్న కూరగా యలు, పాలు, పండ్లు విరివిగా తీసుకోవాలని సూచించారు. లయన్స్ డిస్ట్రిక్ట్ మెంటార్ సాయి, సభ్యులు వి.కృష్ణప్రసాద్, ఎం.ఉమ తదితరులు పాల్గొన్నారు.


మత్స్యకార సొసైటీ సభ్యులకు వలలు పంపిణీ చేస్తున్న అధికారులు

## ఆధునిక విధానాలతో చేపల సాగు చేపట్టాలి

కైకలూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చేపల పెంపకంలో మంచి యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడులను సాధించాలని మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రమేష్ రాథోడ్ అన్నారు. బుధవారం కైకలూరు మండలం గోపవరంలో విజయవాడకు చెందిన కేంద్రీయ మంచినీటి పరిశోధన సంస్థ (సీఐఎఫ్ఎ), రీజనల్ రీసెర్చ్ సెంటర్ (ఆర్ఆర్‌సీ) ఆధ్వర్యంలో మత్స్యకారులకు వలలు, చేపల మందులు, సున్నం ఉచితంగా పంపిణీ చేశారు. మంచినీటి చేపల పెంపకంలో ఆధునిక సాగు పద్ధతులను వివరించారు. కైకలూరు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి గణపతి, గోపవరం మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు కురేళ్ళ శంకరరావు, సభ్యులు పాల్గొన్నారు.

## షెడ్డు నిర్మాణానికి విరాళం



ముదినేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం సింగరాయ పాలెంలోని శ్మశాన వాటికలో విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి ఆలయ అర్చకులు తోలేటి వీరభద్రశర్మ, తోలేటి శివరామకృష్ణ రూ.లక్ష విరాళం అందజేశారు. సింగరాయపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అర్చకుడిగా వ్యవహరించిన స్వర్గీయ తోలేటి కృష్ణమోహన్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు, ప్రస్తుత దేవస్థానం అర్చకులు ఈ విరాళాన్ని పంచాయతీ కార్యదర్శి సీతారామరాజుకు బుధవారం అందజేశారు.



## మండల స్థాయి బాలికల క్రీడా పోటీలు ప్రారంభం

నూజివీడు టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నూజివీడు మండల స్థాయి బాలికల క్రీడా పోటీలను నూజివీడు సెయింట్ థామస్ పాఠశాలలో నిర్వహించారు. ప్రధాన ఉపాధ్యాయుడు బ్రదర్ కిషోర్ కుమార్, బ్రదర్ జార్జ్‌రెడ్డి, సుజన్‌రెడ్డి క్రీడాప్రాంగణాలను ప్రారంభించి మాట్లాడుతూ క్రీడలతో పిల్లల శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడుతుందని పేర్కొన్నారు. బాలికల పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల ఇన్‌చార్జ్ స్వప్న, పీటీలు అలీఖాన్, సరళ, రవీంద్ర సుకుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### బ్రాయిలర్ ధరలు

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 127, 136, 147 |
| చికెన్ విత్ స్కిన్ | 242 |
| చికెన్ స్కిన్‌లెస్ | 252 |

**నెక్ కోడి గుడ్డు ధర (100)**

విజయవాడ జోన్ రైతు ధర రూ.475


కొత్తగూడెంలో మేలో జరిగిన రీ సర్వే గ్రామసభలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ (ఫైల్)

# భూ సమస్యలు పరిష్కారమయ్యేనా?

- గత ప్రభుత్వ తప్పుల తడక సర్వేతో నిద్రలేని రాత్రులు.. రైతుల ఆవేదన
- నేడు కొత్తగూడెంలో సబ్ కలెక్టర్ రీ సర్వే గ్రామసభ

చాట్రాయి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగూడెం గ్రామంలో నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అధ్యక్షతన గురువారం జరిగే రీసర్వే గ్రామసభతో తమ భూ సమస్యలు పరిష్కారమవుతాయా అన్న ఉత్కంఠతో రైతులు ఉన్నారు. మే 27న జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి గ్రామంలో రీసర్వే గ్రామ సభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు తీసుకొని భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే జూలై 31న అప్పటి నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ చాట్రాయి తహసీల్దార్ కార్యాలయంలో కొత్తగూడెం రీ సర్వే బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. గ్రామసభలో జేసీకి 134 మంది రైతులు అర్జీలు ఇవ్వగా 23 అర్జీలు పరిష్కారమయ్యాయని, మరో 26 నూజివీడు సబ్ కలెక్టర్ వద్ద పరిష్కార దశలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. జాయింట్ కలెక్టర్ గ్రామానికి వచ్చినా తమ భూ సమస్యలు పూర్తిగా తీరలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిద్రలేని రాత్రులు గడుపుతున్నాం..**

కొత్తగూడెంలో 2023లో వైసీపీ హయాంలో జరిగిన భూముల రీసర్వే తప్పుల తడకగా ఉండటంతో నిద్ర లేని రాత్రులు గడుపుతున్నామని రైతుల గగ్గోలు పెడుతున్నారు. రీసర్వే సమయంలో అధికారులు ఫీల్డ్‌కి రాకుండా సచివాలయంలో ఉండి రికార్డులు తయారు చేసి ఆన్‌లైన్ చేయటం వల్ల ఎక్కువ శాతం రైతుల భూములు రికార్డులలో తక్కువ విస్తీర్ణం నమోదైందని, కొన్ని పట్టా భూములు అసైన్డ్ భూములుగా నమోదుతో వన్ బీ అడంగళ్ రావటం లేదని, కొన్ని భూములు రికార్డుల నుంచి గల్లంతయ్యాయని, ఫలితంగా రుణాలు ఇచ్చిన బ్యాంకులు 'మీరు భూములు అమ్ముకున్నారు. లోన్లు కట్టండి' అంటూ ఒత్తిడి చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు.

**ఇదేం న్యాయం..**

కొంత మంది రైతుల భూముల విస్తీర్ణం తక్కువ నమోదు కాగా, మరికొంత మందికి వారికి ఉన్న భూమి కంటే ఎక్కువ విస్తీర్ణం నమోదైందని, ఎక్కువ భూమి నమోదైన రైతులు ఒప్పుకుంటే వ్యత్యాసాలు సరిచేస్తామని అధికారులు అనటం అన్యాయమని, తమ భూములకి కోత పెట్టటమే కాక ఎవరినో వెళ్ళి బతిమాలుకోమని చెప్పటం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తమ ఆవేదనను అధికారులు అర్థం చేసుకొని భూ సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే మళ్ళీ భూములన్నీ సర్వే జరపాలని కొత్తగూడెం రైతులు డిమాండ్ చేస్తున్నారు.


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీడీవో ఫణీంద్ర

## అవగాహన సదస్సు

కలిదిండి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కలిదిండి పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, అగ్నికుల, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్లు అంద్రాజు శ్రీనివాస్, లంకా రత్నారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కురేళ్ల ఏడుకొండలు, ఎంపీడీవో ఫణీంద్ర, ప్రిన్సిపాల్ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

## బాలిక హాస్టల్ పరిశీలన

ఆగిరిపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లిలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను ఎంపీడీవో బి. భార్గవి బుధవారం తనిఖీ చేశారు. మురుగుదొడ్లు, తాగు నీటిని పరిశీలించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా చూడాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం భోజనంపై విద్యార్థినులను ఆరా తీశారు.

**గ్రామ సచివాలయం తనిఖీ**

అడవి నెక్కలంలోని గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో భార్గవి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను, ఉద్యోగుల హాజరు పట్టీని పరిశీలించారు. సచివాలయం పరిశుభ్రంగా ఉండాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలని ఉద్యోగలకు సూచించారు. మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వరిలో ఆకుమచ్చ తెగులు

చాట్రాయి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వరిలో పైరులో అక్కడక్కడ ఆకుమచ్చ తెగులు గమనించటం జరిగిందని రైతులు నివారణ చర్యలు చేపట్టాలని ఏవో శివశంకర్ సూచించారు. బుధవారం చాట్రాయిలో వరి పొలాలను పరిశీలించిన ఏవో రైతులతో మాట్లాడుతూ అధిక వర్షాలు, అధిక ఉష్ణోగ్రత, అధిక యూరియా వినియోగం వల్ల ఆకుమచ్చ తెగులు సోకుతుందని, ఈ లక్షణాలు కన్పిస్తే నత్రజని వేయటం తాత్కాలికంగా ఆపివేయాలని, తెగులు ఆశించిన పొలంలో ఎక్కువ నీరు నిల్వ ఉంచవద్దని, అంకురం ఏర్పడే దశలో పొటాష్ వాడాలని సూచించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్+టెట్రాసైక్లిన్+కాపర్ ఆక్సీక్లోరైడ్ కాంబినేషన్ మందులను 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు.

## ఘనంగా అన్నసమారాధన

ముదినేపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పెయ్యేరు కనకదుర్గానగర్‌లో గల దుర్గమ్మ ఆలయంలో శరన్నవ రాత్రులు ముగింపు సందర్భంగా బుధవారం భారీ అన్నసమారాధన జరిగింది. ఎంపీపీ సత్యనారాయణ, ముదినేపల్లి మాజీ సర్పంచ్ పామర్తి సత్యనారాయణ అన్నసమారాధనను ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు మరడాని సత్యనారాయణ, సాక్షి సాయిబాబు, దివి సతీష్ తదిరతులు పర్య వేక్షించారు.

## మూణ్ణాళ్ల ముచ్చట!

(5వ పేజీ తరువాయి)

అడుగు పెట్టగానే జారి పడ్డాడు. వైసీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి అప్పట్లో సచివాలయాల పనులు చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే తూతూ మంత్రంగా ఫ్లోరింగ్‌కు మెరుగులు దిద్ది సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఫ్లోరింగ్ పనులు మళ్లీ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## 11 రోడ్లు.. రూ.30.18 కోట్లు

(5వ పేజీ తరువాయి)

నుంచి కోరుకల్లు ఐదు కి.మీలకు రూ.4.30 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కాగా కృష్ణా జిల్లా నుంచి ఏలూరు జిల్లాలో కలిసిన రెండు రోడ్లకు ఈసారి ప్రాధాన్యం ఇవ్వడం విశేషం. జంక్షన్ సమీపంలోని నూజివీడు-వయా కల్లూరు రోడ్డు, కైకలూరు నియోజకవర్గంలో లోహడి కొత్తగూడెం రోడ్లకు మోక్షం కలగనుంది.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ చేసిన సబ్ కలెక్టర్


నూజివీడులో తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంపై వచ్చిన పలు ఆరోపణల నేపథ్యంలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సదరు కార్యాలయంలో ప్రభుత్వ సిబ్బంది కేవలం నలుగురే ఉండగా, ప్రైవేటు సిబ్బంది అంతకు మించి ఉండటంపై అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. కార్యాలయానికి వచ్చే కక్షిదారులకు వాహనాల పార్కింగ్ లేకపోవటం, మరుగుదొడ్ల సౌకర్యంపై సబ్ కలెక్టర్ ఆరా తీశారు. రోడ్లపైనే రిజిస్ట్రేషన్ చేయటం మొదలైన సమస్యలను ఆమె కక్షిదారులను అడిగి తెలుసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెగ్యూలర్ సబ్ రిజిస్ట్రార్ లేకపోవటంపై పలువురు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తనిఖీపై సబ్ కలెక్టర్ ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు సమాచారం.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీ తహేర సుల్తానా

## సృజనాత్మక శక్తిని పెంచేలా బోధించాలి : జేడీ

ఆగిరిపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంచేలా బోధన ఉండాలని పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ తహేర సుల్తానా పేర్కొన్నారు. మెగా డీఎస్సీ-25లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు తోటపల్లి హీల్ పాఠశాలలో జరుగుతున్న శిక్షణ బుధవారం నాటికి ఐదో రోజుకు చేరింది. కార్యక్రమాన్ని జేడీ పరిశీలించి మాట్లాడుతూ విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందేలా బోధన ఉండాలన్నారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. డీఈవో ఎం. వెంకటలక్ష్మమ్మ, డాక్టర్ రావి అరుణ, శ్రీమన్నారాయణ, ఏఎంవో రెడ్డి రామారావు, రవీంద్ర ప్రసాద్, భాస్కర్ కుమార్, ఎంఈవోలు ఆనంద్‌కుమార్, బీవీఎస్ సుబ్బారావు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

## ఆధార్ అప్‌డేట్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ చేస్తున్న పోస్టల్ సిబ్బంది

కైకలూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆధార్ అప్‌డేట్ కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గుడివాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కైకలూరు హోలీక్రాస్ స్కూల్లో ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను ప్రారంభించారు. జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా ఈ ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలతో పాటు నివాసకాలనీల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఈ సేవలు పూర్తిగా ఉచితంగా చేస్తామని, గమనించి ఈ ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకో వాలన్నారు. ఈ నెల 10, 11వ తేదీలలో ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో, 13, 14వ తేదీలలో విస్సన్నపేట సిద్దార్థ హైస్కూల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. కైకలూరు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్‌మాస్టర్ కె సురేష్‌కుమార్, జి. మోహనవర్మ, కె. ఏసుపాదం, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.


## బాణసంచా..చీకట్లు

(5వ పేజీ తరువాయి)

పెడుతున్నారు. అధికారులు తూతూ మంత్రంగానే తనిఖీలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇక దీపావళి పండుగను పురస్కరించుకుని దీపావళి ముందురోజు, దీపావళి రోజు సాయంత్రం 6 గంటల వరకు తాత్కాలిక షాపుల అనుమతులు కోసం ఇప్పటి వరకు 24 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, కైకలూరు మండల ప్రధాన కేంద్రాల్లో ఏర్పాటు చేసుకోవడానికి దరఖాస్తులు చేసుకుంటున్నారు. అయితే జనవాసాల మధ్య వీటికి అనుమతులు ఉండవంటూ స్పష్టం చేస్తున్నారు. అనధికారిక విక్రయాలపై చర్యలు తీసుకుంటామని పోలీసులు, ఫైర్, రెవెన్యూశాఖ అధికారులు ప్రకటనలకే పరిమితం అవుతున్నా యన్న విమర్శలు ఉన్నాయి.

### అన్ని జాగ్రత్తలు సూచిస్తున్నాం..

**టి.శ్రీనివాస్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, ఏలూరు జిల్లా**



గత ఘటనల దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బాణసంచా విక్రయ, నిల్వ దారులకు సూచిస్తున్నాం. ఇప్పటికీ రెవెన్యూ డివిజనల్ అధికారుల ద్వారా వచ్చిన దరఖాస్తులను పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి దీపావళి షాపు ఏర్పాటుకు తాత్కాలిక అనుమతి ఇస్తున్నారు. దీపావళి రోజు సాయంత్రం 5 గంటలకు షాపులన్నీ మూసివేయాలి. పిల్లలు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ షాపులున్న ప్రాంతంలో అగ్నిమాపక వాహనాన్ని అక్కడ ఏర్పాటు చేస్తున్నాం. మిగిలిన ప్రాంతాల్లో అగ్నిమాపక సిబ్బందిని ఫైర్ ఎగ్జిట్ మిషన్లతో డ్యూటీలు వేస్తున్నాం.

### ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు : కలెక్టర్

'బాణసంచా ప్రమాదాలు సంభవించకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. పోలీసు, రెవెన్యూ, ఫైర్, తదితర శాఖల అధికారులతో తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి బాణసంచా అనధికార, తయారీ నిల్వ, అమ్మకం, భద్రతా చర్యలపై ప్రత్యేక నిఘా పెట్టాలి' అని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. జిల్లాలో బాణసంచా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, బాణసంచా అనధికార తయారీ నిల్వలు, అమ్మకాల నియంత్రణపై బుధవారం అధికారులతో కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్సులో ఎస్పీ కె.ప్రతాప శివ కిశోర్‌లతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టీసీ, ప్రైవేట్ రవాణా వాహనాలను చెక్ పోస్టల వద్ద తనిఖీలు నిర్వహించాలని, అనధికారికంగా బాణసంచా రవాణా చేసే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ గతంలో ఊరు శివారు ప్రాంతంలో బాణసంచా తయారీకి అనుమతులు ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో నివాసిత గృహాలు వచ్చి ఉంటాయని, అటువంటి తయారీ కేంద్రాలను అక్కడ నుంచి తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలు ఒకేచోట ఉంటే వాటిని దూరంగా ఏర్పాటే చేసేలా యజమానులకు తెలపాలన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రేపు క్రీడా జట్ల ఎంపికలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అండర్-14, 17 విభాగాల్లో జిల్లా క్రీడా జట్ల ఎంపికల షెడ్యూలు ఖరారైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు, డీఈవో వెంకట లక్ష్మమ్మ, జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ బుధవారం వివరాలు తెలిపారు. ఈ నెల 10న ఉదయం 9 గంటలకు కొవ్వలి జడ్పీ హైస్కూలులో బాస్కెట్‌బాల్, ఏలూరు ఇండోర్ స్టేడియంలో రెజ్లింగ్ ఎంపికలు జరుగుతాయని, క్రీడాకారులు వారు చదువుతున్న స్కూలు హెచ్ఎం సంతకంచేసిన ఎంట్రీ ఫారం, క్రీడాదుస్తులు, వాటర్ తెచ్చుకోవాలని, వివరాలకు ఫోన్ నంబరు 90308 94311లో సంప్రదించాలని కోరారు.

## కైకలూరు టౌన్ సీఐగా రామకృష్ణ



కైకలూరు, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): కైకలూరుటౌన్ సీఐగా ఎవిఎస్ రామకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయవాడ ఇంటెలిజెన్స్ సీఐగా పనిచేసి బదిలీపై కైకలూరు టౌన్ సీఐగా బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన సీఐ పి. కృష్ణ వీఆర్‌కు బదిలీ అయ్యారు.



## కలిదిండిలో భారీ వర్షం

కలిదిండి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. తోపుడు బండ్ల వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మార్కెట్ యార్డు సమీపంలో ప్రధాన రహదారి జలమయం అయింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత వల్ల ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. సాయంత్రం భారీ వర్షం కురవటంతో సేదతీరారు. చేపలు, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ లోపించే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల మత్స్యశాఖాధికారి రవి కుమార్ తెలిపారు.


చనుబండలో ఉపాధి గ్రామసభ

## ఉపాధి పనులతో గ్రామాభివృద్ధి

చాట్రాయి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పించటమే కాక గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసుకోవచ్చునని పీఏసీఎస్ అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చనుబండ సచివాలయం-1లో బుధవారం ఏపీవో లక్ష్మీకుమారి అధ్యక్షతన ఉపాధి గ్రామసభ నిర్వహించారు. 2177 మంది కూలీలు ఉన్నారని, వీరికి 100 రోజులు పనులు కల్పించే విధంగా పనులు గుర్తించి ఈ నెల 21న జరిగే గ్రామ సభలో ఆమోదించుకోవాలని ఏపీవో కోరారు. కూటమి నాయకులు కందుల కృష్ణ, నక్కా రాము, చీదిరాల మారేశ్వరరావు, బుర్రి శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

కైకలూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పాత గొడవల నేపథ్యంలో ఒక వ్యక్తిపై దాడి చేసి హతమార్చేందుకు యత్నించిన నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కైకలూరు రూరల్ ఎస్సై వి. రాంబాబు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం ఈ నెల 2న దసరా ఉత్సవాల్లో కైకలూరు మండలం నరసాయిపాలెం గ్రామానికి చెందిన మాడపాటి రమేష్ పాత గొడవల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన బోయిన జయప్రకాష్‌పై కర్రతో దాడి చేశాడు. దీంతో జయప్రకాష్ తలకు బలమైన గాయాలు కావడంతో విజయవాడలోని ఆసుపత్రిలో ప్రాణాపాయస్థితిలో ఉన్నాడు. అప్పట్లో బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దీంతో నిందితుడు రమేష్‌ను బుధవారం అరెస్టు చేసి కైకలూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు.

## ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు

కైకలూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కిడ్నీవ్యాధితో బాధపడుతున్న వ్యక్తి మనస్తాపానికి గురై గత నెల 27న పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కైకలూరు రూరల్ ఎస్సై వి. రాంబాబు వివరాల ప్రకారం మండలంలోని శృంగవరప్పాడు గ్రామానికి చెందిన మోరు లక్ష్మణ(49) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ తీవ్ర అనారోగ్యానికి గురై గత నెల 27న పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించగా అతనిని కుటుంబీకులు భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## తమ్మిలేరులో ట్రాక్టర్ బోల్తా

### తప్పిన ముప్పు

చాట్రాయి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు, చింతలపూడి మండలం పోతునూరు గ్రామాల మధ్య తమ్మిలేరులో బుధవారం ట్రాక్టర్ బోల్తా పడగా డ్రైవర్ ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడు. కోటపాడు నుంచి చింతలపూడి వెళుతూ తమ్మిలేరు దాటుతూ ట్రాక్టర్ బోల్తా పడింది. తమ్మిలేరు దాటే క్రమంలో తరుచు ప్రమాదాల బారిన పడుతున్నారు. కోటపాడు గ్రామస్థులు వివిధ పనుల నిమిత్తం నిత్యం తమ్మిలేరు దాటి చింతలపూడి పట్టణానికి వెళుతుంటారు. ఇక్కడ తమ్మిలేరుపై బ్రిడ్జి లేకపోవటం వల్ల తమ్మిలేరు దాటడం ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలని 30 ఏళ్ళ నుంచి ప్రజలు కోరుతున్నా పాలకులు పట్టించుకోవటం లేదు.

## లభించని వృద్ధురాలి ఆచూకీ

### వెనుదిరిగిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

ముదినేపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో ఈ నెల 3న అదృశ్యమైన వీరంకి విమల (65) అనే వృద్ధురాలి ఆచూకీ నేటికీ లభ్యం కాలేదు. భర్త చనిపోయాడన్న మనోవేదనతో ఇంటి నుంచి ఆ వృద్ధురాలు వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఒక వృద్ధురాలు పోల్ రాజ్ కాలువలోకి దిగి నీటిలో కొట్టుకుపోయిందని కొందరు తెలిపిన సమాచారంతో టీడీపీ నాయకుడు బొర్రా చలమయ్య చొరవతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అమలాపురం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఐదు రోజులు ఆ కాల్వల్లో గాలించినా వృద్ధురాలి ఆచూకీ లభ్యం కాలేదు. చివరికి ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపు నిలిపివేసి వెనుదిరిగారు.